ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
Entered

స్నేహ

మార్చి 30, 2008

కళ్లు... ప్రపంచానికి వాకిళ్లు...

హ్యాపీ బర్త్‌డే

(2008 మార్చి-30 నుంచి 2008 ఏప్రిల్-5 వరకు)

ఇ. సాత్వికా చౌదరి
మార్చి-31
మాధవి-సృజన్
ముఠాపురం-ఖమ్మం

వి. హరి సంపత్
ఏప్రిల్-5
మెహర్వాణి-ప్రసాద్
ఉక్కునగరం-విశాఖ

ఎస్. లక్ష్మి మాధవి
ఏప్రిల్-4
ఉజ్జీవనజ్యోతి-రవికిరణ్
కృష్ణలంక-విజయవాడ

సి. మౌనిక
మార్చి-30
గీత-రవి
వసంతనగర్-కర్నూలు

జి. యశస్విని
ఏప్రిల్-3
పుష్ప-చంద్రమౌళి
నూతనకల్లు-నల్గొండ

కె. శ్రవణ్‌కుమార్
ఏప్రిల్-3
రాజేశ్వరి-వెంకటేశ్వర్లు
మధురానగర్-ఖమ్మం

ఎం.డి. ముస్కాన్
ఏప్రిల్-3
నిషా-ఖాసిం
చీరాల-ప్రకాశం

ఆర్. సహజ
ఏప్రిల్-2
సత్యవతి-భరత్‌కుమార్
బురహన్‌పురం-ఖమ్మం

యు. రాణాప్రతాప్ రెడ్డి
ఏప్రిల్-2
శ్రీదేవి-శ్రీనివాసరెడ్డి
అలంపూర్-మ॥నగర్

ఐనాల సౌగంధి యశస్విని
ఏప్రిల్-3
జానకి-సైదులు
కనకగిరి సిరిపురం-ఖమ్మం

ప్రాచీన ప్రతిపత్తి ఇచ్చేవరకు ఉద్యమించాల్సిందే

మన అతిథి

పేరు : తుర్లపాటి కుటుంబరావు
ఊరు : విజయవాడ
తల్లిదండ్రులు : శేషమాంబ, సుందరరామానుజరావు
చదువు : జర్నలిజం
పుట్టిన తేది : 10-8-1933
వృత్తి : 14వ ఏట నుండి జర్నలిజం (కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యునిగా 2008 ఫిబ్రవరి 18న నియమితులయ్యారు)
నచ్చిన వ్యక్తులు : టంగుటూరి ప్రకాశం పంతులు, జవహర్‌లాల్ నెహ్రూ
నచ్చిన రచనలు : నార్లవారి సంపాదకీయాలు, ప్రకాశంగారి 'నా జీవిత యాత్ర', ఆత్మకథ, డిస్కవరీ ఆఫ్ ఇండియా
ప్రవృత్తి : కొన్ని వేల జీవిత చరిత్రలను వెలుగులోకి తేవడం
అవార్డులు : 2002లో పద్మశ్రీ బిరుదు, ఆంధ్ర విశ్వ విద్యాలయం వారి 'కళా ప్రపూర్ణ', 1993లో 'దశసహస్ర సభాకేసరి'గా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారు.
మర్చిపోలేని సంఘటన : మే2003లో తమిళనాడులోని ద్రావిడ పార్టీలన్నీ తమ రాజకీయ విభేదాలు విస్మరించి సమైక్యంగా అప్పటిప్రధాని వాజ్‌పేయిని కలుసుకొని ప్రాంతీయ భాషలన్నింటిలో తమిళం ప్రాచీనమైనదని, అందువలన దానికి ప్రాచీన ప్రతిపత్తి ఇవ్వాలని (క్లాసికల్ లాంగ్వేజ్) అంతేకాక, తమిళ భాషకు జాతీయ స్థాయిలో హిందీ తరువాత ద్వితీయ అధికార భాషా ప్రతిపత్తి ఇవ్వాలని అభ్యర్థించాయి. ఈ వార్తను చూసిన మరునాడే ప్రధాని వాజ్‌పేయికి టెలిగ్రాం ఇస్తూ హిందీ తరువాత భారతదేశంలో హెచ్చుమంది మాట్లాడే భాష తెలుగేనని, అందువల్ల భాషా ప్రతిపత్తి ఇవ్వాలని పేర్కొన్నాను.

తెలుగు భాషకు మాధుర్యం, శబ్ద సౌందర్యం, ఉచ్ఛారణా సౌలభ్యం, దేశ కాల, పరిస్థితులకు అనుగుణంగా విస్తరిం చగల అంతర్గతమైన ప్రత్యేకతలున్నాయి. పైగా భారతదేశంలోని ప్రాంతీయ భాషలన్నింటిలోకి తెలుగు జీవద్భాష. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల బోధనకు కూడా అనువైన భాష. భారతదేశానికి జాతీయ స్థాయిలో దేనినైనా అధికార భాష చేయాలంటే అందుకు అన్ని విధాలా అనువైనది. యోగ్యతార్హతలు కలది తెలుగుభాషే. భాషాభిమానులు, తెలుగువారంతా ఉద్యమకారులతో కలిసి తెలుగుకు ప్రాచీన ప్రతిపత్తి వచ్చేంతవరకూ ఉద్యమాన్ని ఆపకూడదు. దీనికి నావంతు కృషిని నేను కొనసాగిస్తాను.

ఈ సంచికలో....

టపా	...	2
చూద్దామా	...	3
మనసా... తెలుసా	...	4
ఆరోగ్యం	...	5
సీరియల్	...	8
సినిమా	...	10
నవ్వుల్... పువ్వుల్	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

మంచిపుస్తకం ...6

తెలుగు నాట ఎర్రబావుటా!

లాహిరి లాహిరిలో ... 20

తెర వెనక్కి వెళ్లిన 'పాకీజా' మీనాకుమారి!

రుచి	...	17
విజ్ఞాన వీచిక	...	22
సలహాలు	...	23
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18

అమ్మవారి సంబరం



ఉపయోగపడే సమాచారాన్నిచ్చిన 'మందు వేసవే...'

మార్చి మూడవ ఆదివారం సంచికలో అట్టమీది కథగా అందించిన 'మందు వేసవే పండు వెన్నెల' బావుంది. వేసవికాలంలో ఎలా మసలాలో... ఎటు వంటి జాగ్రత్తలు తీసుకోవాలో, చిట్కాలతో, సూచనలతో, అందరికీ ఉపకరించే సమాచారాన్ని అందించారు. ఈసారి 'సమ్‌థింగ్ స్పెషల్' ద్వారా సమాజ ప్రగతిలో సైన్స్ కున్న ప్రాధాన్యతను తెలుసుకున్నాం. చూద్దామాలో ముస్సోరి అందాలను పరికించగలిగాం. నిజమైన 'గన్నే' అయినా, 'మినీగన్' అతి చిన్న రూపం ప్రపంచంలో కెల్లా అతి చిన్న టీపాట్ దృశ్యం, గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించిన 'బుల్లి' న్యూస్‌పేపర్ వైనం అంశాలన్నీ అబ్బురపరిచే విషయాలే. 'సినిమా కబుర్లు' లేని లోటు, 'లాహిరి లాహిరి' శీర్షిక తీర్చింది. 'విజ్ఞానవీచిక' ద్వారా 2008 సంవత్సరాన్ని అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని, గ్రహించాం. మాతృ భాషతోపాటు ఆంగ్ల భాషలోనూ పట్టు ఉండాలని పేర్కొన్న మన అతిథి తక్కెళ్ళపల్లి తిరుపతి రావు అభిప్రాయం సహేతుకంగా ఉంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అతిథి మాట సరైన మాట

మాతృభాషతో పాటు, ఇంగ్లీషు అవసరమంటున్న తిరుపతి రావు గారిది సరియైన ఆలోచన. జింజర్ షర్బత్ ఆరోగ్యదాయకం. వేసవి జాగ్రత్తలు, జాగ్రత్తగా ఉన్నాయి. చిన్నారులకు చిట్కాలు బాగున్నాయి. బి.ఎన్. రెడ్డి., కె.వి. రెడ్డి గార్ల కాంబినేషన్ బావుంది. వారి చెలిమి అటువంటిదే. నమ్మలేని నిజాలను నమ్మించేలా రాశారు. మూఢనమ్మకాలను తరిమారు. 'హోలీ' చిట్కాలు హాయిగా జరుపుకునేలా బాగున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

విజ్ఞానదాయకమైన వ్యాసం

2008 సంవత్సరాన్ని అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. భూమిని కాపాడుకుందాం వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంది. భూమిని కాపాడుకుంటేనే మానవ మనుగడ వుంటుంది. ప్రపంచంలో నాలుగు లక్షల మంది శాస్త్రవేత్తలు భూమిని పరిరక్షించాలని తెలియచేస్తున్నప్పటికి మన పాలకులకు పట్టడం లేదు. విశాఖ ఏజెన్సీలోని బాక్సైట్ తవ్వితే భూ సమతుల్యం దెబ్బతింటుంది. "ఆలోచనే ఆయుధంగా" పుస్తక పరిచయం బాగుంది. ప్రజాశక్తి ప్రచురణలు అన్నీ విజ్ఞానదాయక మైనవే కనుక అన్నింటిని పరిచయం చేయవలసిందిగా కోరుతున్నాం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

కళ్లకు కట్టిన 'చిగురాకులలో చిలకమ్మా'

స్నేహ పాఠకులు ముఖ్యంగా సినీ అభిమానులు ముందుగా చదివేది గుండెకాయ వంటి ఐటెమ్ "లాహిరి లాహిరిలో". ప్రేక్షకుల నాడి చూసి సరైన రక్త ప్రసరణతో మరింత ఊపిరి పోస్తున్నారు జె.పి. వైద్య. నేటి తరానికి ఎన్నో తెలియని వెలకట్టలేని విలువైన సంగతులు తెలియచేస్తు న్నందుకు ఆయనకు ధన్యవాదాలు. ఈ వారం 'చిగురాకులలో చిలకమ్మా...'లో నాటి హీరో రామానుజాచారి, కాంచనమాల అశ్లీల సన్నివేశాల రబస నుండి అన్నపూర్ణ పిక్చర్స్ తొలి చిత్రం దొంగ రాముడు వరకు వివరించిన తీరు ఎంతో ఆకట్టు కుంది. వాహినీ స్టూడియోతో కె.వి. రెడ్డి గారి అనుబంధం గురించి... అప్పటి వాహినీ స్టూడియోతో కె.వి. రెడ్డి గారి అనుబంధం గురించి... కళ్లకు కట్టినట్లు నాటి బ్లాక్ & వైట్ సన్నివేశాలను 70 ఎం.ఎం థియేటర్లో చూసిన అనుభూతి కల్పించారు.

యర్రమోతు ధర్మరాజు
ధవళేశ్వరం, తూ॥గో॥ జిల్లా.



వేసవిపై వ్యాసం బాగుంది

వేసవి కాలంలో ధరించాల్సిన వస్త్రాల దగ్గర్నుండి తినే ఆహారం, వడదెబ్బ కొడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించీ 16.3.08 నాటి ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో చక్కగా వివరించారు. ఎండలు బాగా ముదురుతున్న ఈ తరుణంలో ఇంత చక్కటి వ్యాసంలో ఆ విషయాలన్నీ చర్చించడం ప్రజలందరికీ ఎంతో ఉపయుక్తమని భావిస్తున్నాను. ఈ అట్టమీది కథ ద్వారా వేసవితాపం నుండి రక్షించుకునే ఎన్నో మార్గాలను తెలుసుకున్నాం. అలాగే 'జన చైతన్యం కోసమే...' అంటూ సమాజంలోని మూఢాచారాలనూ, బాబాల జిమ్మిక్కులను గురించీ సైన్స్ ద్వారా వివరిస్తూ ప్రచారంచేస్తున్న టి. రమేష్ గారి కృషిని "సమ్‌థింగ్ స్పెషల్" శీర్షికలో తెలుసుకున్నాం. ప్రతి జిల్లాలోనూ ఇంకా ఎక్కువ ప్రదర్శన లిస్తే ఫలితాలు బాగుం టాయని భావిస్తున్నాను.

గొల్లమందల సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

యాజీవ్

మళ్లీ మళ్లీ చూడాలనిపించే నైనిటాల్



సెయింట్‌జాన్ చర్చి

కార్బెట్ పార్క్

ఒకప్పటి ఉత్తరప్రదేశ్ వేసవి రాజధానిగా... ఆహ్లాదకరమైన వేసవి విడిదిగా యాత్రికులను ఓలలాడించే ప్రదేశం నైనిటాల్. ఇది ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోకి వచ్చింది. సముద్రమట్టానికి 6350 అడుగుల ఎత్తున వుండే ఈ అందమైన ప్రదేశం భారతదేశ సరస్సుల జిల్లాగా కూడా పేరొందింది. ఒకప్పుడు 60 సరస్సులు వుండేవికానీ నేడు వాటిలో చాలా వరకు అదృశ్యమైపోయాయి. అయినా ఒకే సరస్సు ఇప్పుడు ప్రపంచవ్యాప్త పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది.

నైనిటాల్ అంటే నేత్ర సరస్సు. భస్మమైపోయిన సతి పార్వతి దేహాన్ని శివుడు తీసుకెళుతుండగా అనేక భాగాలు అక్కడక్కడా పడిపోయాయట. నీలి నేత్రాలు మాత్రం ఇక్కడ పడ్డాయని ప్రతీతి. అందువల్ల ఈ ప్రదేశానికి ఆ పేరు వచ్చింది. నైనాదేవి ఆలయం కూడా ఇక్కడే వుంది.

నైనిటాల్ లోయ బహు సుందరంగా వుంటుంది. నైనిటాల్ సరస్సు చుట్టూ ఎత్తైన పర్వతాలు, పచ్చని వృక్షాలతో చల్లగా వుంటుంది. వేసవిలో 27°c డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత వెళ్లినా శీతాకాలంలో 3^{0}c వరకూ పడిపోతుంది. అయినా ఈ ప్రదేశానికి ప్రతి కాలంలోనూ యాత్రికులు వెళుతుంటారు.

పడవ షికారుకి...బద్ధకంగా చలి ఎండ కాచుకోవడానికీ...తీరుబడిగా సరస్సు చుట్టూ నడవడానికీ ఈ హిల్ స్టేషన్ అమోఘంగా వుంటుంది. నైనిటాల్‌కు 6 కిమీ దూరంలో నైనా పీక్ (చైనా పీక్) వుంది. నైనిటాల్‌లో అతి ఎత్తైన శిఖరం ఇది. దీని పైనుంచి హిమాలయాల్ని చూడవచ్చు. ఇక్కడకు గుర్రాలపైనా లేదా ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లవచ్చు. సాధారణంగా ఎక్కువమంది ఎక్కరు. కానీ ఓ గంటసేపు నడిచి కొండ ఎక్కి... అక్కడ టీ తాగుతూ.. ఆమ్లెట్ తింటూ చుట్టూ వున్న కొండ లోయల్ని చూడడం గొప్ప అనుభూతి.

ఇటువంటిదే మరో శిఖరం టిఫిన్ టాప్. దీనినే డొరోతీ సీట్ అని కూడా అంటారు. నైనిటాల్ నుంచి దాదాపు 3 కిమీ దూరాన వుండే ఈ శిఖరం నుంచి అద్భుతమైన దృశ్యాలు కనిపిస్తాయి. స్నో వ్యూ అనే మరో కొండ కూడా సుందర దృశ్యాల్ని కళ్ల ముందు సాక్షాత్కరింపచేస్తుంది. దీన్ని చేరడానికి రోప్ వే కూడా వుంది. ఇవన్నీ కాక హనుమాన్ ఘర్, లాండ్స్ ఎండ్, కుర్‌పాతాళ్, భొవాలీ కూడా చూసి తీరవలసినవే.

ఇక్కడ వున్న గుహలు కూడా చూడాల్సినవే. నైనిటాల్ నుంచి 2 కిమీ దూరాన వున్న ఈ గుహల్లోకి వెళ్తున్న కొద్దీ అవి సన్నగా అవుతుంటాయి. చీకటిని... ఇరుకు ప్రదేశాలను...చూసి భయపడేవాళ్లు వీటి జోలికి వెళ్లకుండా వుంటేనే మంచిది.

సెయింట్ జాన్ చర్చి, రాజభవన్, షేర్ వుడ్స్ కాలేజ్, హైకోర్టు భవనాలు కూడా చూడదగ్గవే.

నైనిటాల్‌కి 100కిమీ పరిధిలోపే ఇంకా కొన్ని చూడదగ్గ ప్రదేశాలున్నాయి. వాటిలో ముఖ్యమైనది దేశంలోనే అతి పురాతనమైన జాతీయవనం. జిమ్ కార్బెట్ జాతీయవనం. నిజానికి జిమ్ కార్బెట్ కూడా నైనిటాల్‌లోనే నివాసం ఏర్పరుచుకుని వున్నాడు. ఆయన ఇల్లు -గుర్నీ హౌజ్. అది ఇంకా ఓ మ్యూజియంలా వుంది.

నైనిటాల్‌కి 63 కిమీ దూరంలో వున్న జిమ్ కార్బెట్ వనంలో ఏనుగులు, పులులు, సంబార్ జింకలు, నీల్‌గాయ్‌లు, తాచులు, పంగోలిన్లతో పాటు సుమారు 6-7 వందల జాతుల పక్షులున్నాయి. అటవీ జంతువులంటే ఇష్టం వున్న వాళ్లు, సాహసాలను ఇష్టపడేవాళ్లు తప్పక చూడవలసిన స్థలం ఇది.

నైనిటాల్ చేరడానికి ఢిల్లీ, ఆగ్రా, లక్నో నుంచి బస్సు సౌకర్యం వుంది. ఆహారం పెద్ద సమస్య కాదు. కానీ చలికాలం వెళ్లే వాళ్లు ఎముకలు కొరికే చలికి సిద్ధమవ్వాలి. ఇది అచ్చంగా పర్యాటక కేంద్రమే కాబట్టి పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలన్నీ వుంటాయి.

దుమ్ము, ధూళి, చెమట, వేడి, కాలుష్యాల నుంచి ప్రశాంత వాతావరణానికి వెళ్లాలంటే నైనిటాల్ ఒక మంచి చోటు. ఒకసారి వెళితే మరోసారి కూడా వెళ్లాలనిపించే ప్రదేశం ఇది.



మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

క్లాసులో వున్నా... పాఠం ఎక్కదు

నా వయస్సు 19సంవత్సరాలు. నేను బిఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. నాకున్న మైనస్ పాయింట్స్ ఏమిటంటే నేను మొదట ఇన్ఫీరియారిటీ ఫీలవుతాను. క్లాస్‌లో పాఠం చెప్పే సమయంలో గతంలో జరిగిన విషయాలు గుర్తుకు వస్తుంటాయి. శ్రద్ధగా వినాలనుకున్నా సాధ్యం కావటం లేదు. అందరితో ఫ్రీగా వుండలేకపోతున్నాను. దయచేసి సమస్యను అర్థం చేసుకొని నాకు సరియైన సలహా ఇవ్వగలరు?

బాబు, నిజామాబాద్.

ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ (ఆత్మ న్యూనతా భావం) సాంఘీకంగా, ఆర్థికంగా వెనుకబడ్డ వారిలోను అందం తక్కువ వారిలోనూ ముఖ్యంగా యుక్త వయసు వారిలో ఎక్కువగా ఉంటుంది. కుటుంబ వాతావరణం, స్కూలు వాతావరణం ఇన్ఫీరియారిటీ రావడానికి అవకాశం వుంది. ఎదుటి వారు తమను గమనిస్తున్నారని, తమలోని లోపాలను గుర్తిస్తారని, ఎవరూ పట్టించు కోకపోయినా భయంతో మానసికంగా కుంగిపోతూ ఉంటారు. ఎవరూ ఎవరికంటే తక్కువ వారు కారు. మీలో ఉన్న లోపాలను తెలుసుకొని సరిదిద్దు కోండి. ధైర్యంగా అందరితో కలిసి మెలిసి తిరిగే స్వభావాన్ని అలవర్చుకోండి. ఎంతోమంది కంటే నేను చాలా మెరుగు అనే ఆలోచనతో ముందుకు వెళ్ళండి. అప్పుడే మీలో ఆత్మ విశ్వాసం పెరుగు తుంది. క్లాస్‌లో పాఠం చెప్పే సమయంలో ఒక పుస్తకంలో ముఖ్యమైన విషయాలను రాసుకోవటం అలవాటు చేసుకోండి. ఎప్పుడైతే చెప్పే విషయాలను రాసుకుంటారో కొంత కాలానికి ఆ చెప్పే పాఠాల మీదే మీ దృష్టి వుంటుంది. సందేహాలు ఏమి ఉన్నా వెళ్ళి ఉపాధ్యాయులను అడగటం అలవాటు చేసుకోండి. కాలేజి జీవితం ఎంతో అందమైనది. ఆ జీవితాన్ని ఆనందంగా గడపటానికి చక్కగా చదవండి. కొత్త కొత్త విషయాలను తెలుసుకోండి. కొత్త స్నేహితులను పరిచయం చేసుకోండి. అప్పుడు మీలో ఉన్న సమస్యలు మెల్ల మెల్లగా తగ్గిపోతాయి. ఆల్ ది బెస్ట్.

బాస్కెట్‌బాల్ ఛాంపియన్ కావాలంటే...

నా పేరు సుధాకర్. నా వయస్సు 17 సంవత్సరాలు. ఒకసారి పదవతరగతి ఫెయిల్ అయ్యాను. అయితే తర్వాత సంవత్సరం 60 శాతం మార్కులతో పాసయ్యాను. ఇంట్లో వాళ్ళ అభిప్రాయం మేరకు కాలేజీలో చేరాను. ఏమైనా ఎలాగైనా కష్టపడి ప్రపంచ బాస్కెట్ బాల్ ఛాంపియన్ కావాలని నిర్ణయించుకున్నాను. అందుకు కావలసిన అర్హతలు, శక్తి సామర్థ్యాల గురించి తెలియజేస్తారని ఆశిస్తున్నాను.

సుధాకర్, మెదక్.

ఫెయిల్ అయ్యి మరలా చదివి పాసయ్యారు అంటే మీలో చక్కని శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. మీ ఇంట్లో వాళ్ళ గురించి కాకుండా మీ గురించి చదవాలనుకోండి. బాస్కెట్ బాల్ ఛాంపియన్ కావాలంటే చదవాలి. మీ ఆకారం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకుంటే సెల్ఫ్ ఇమేజి ఏర్పడుతుంది. ఒక నిర్ణీత లక్ష్యాన్ని ఏర్పరుచుకోండి. అప్పడే ఏదైనా నేర్చుకోగలుగుతారు. నేర్చుకున్న దాన్ని సాధన చేయండి. మరింత సమర్థవంతంగా ప్రాక్టీసు చేయండి. మీలో ఉన్న శక్తి, సామర్థ్యాలను మేల్కొలపండి. చదువుపై ఆటపై చురుగ్గా ఆసక్తిని పెంచుకుంటే మీరు అనుకున్న విధంగా ఛాంపియన్ కాగలరు.

నేస్తాలతో పోలిస్తే ఎలా?

నేను ఇంటర్‌మీడియట్ చదువు తున్నాను. మా అమ్మ నన్ను ఎప్పుడూ ఇతరులతో పోల్చి తిడుతుంది. దానితో చద వాలన్నా చదవలేకపోతున్నాను. పరీక్షలు సరిగా రాయలేకపోతున్నాను. ఏమి చెయ్యాలో తెలపండి.

భవ్య, తిరుపతి.

మీ అమ్మగారు మిమ్మల్ని ఇతరులతో పోల్చడం మీలో మానవ సంబంధాలు దెబ్బతీసే స్థితికి తీసుకువెళుతుంది. ఆవిడ అన్న విషయాలను పట్టించుకోకండి. పెద్ద వాళ్ళు వాళ్ళ అనుభవంతో మాట్లాడతారు. కానీ మీలో చక్కగా ఆలోచించే శక్తి ఉంటుంది. కాబట్టి మీలో కొత్త అంశాన్ని కొత్త విషయాన్ని కనుగొనటంలో పోటీ ఉండాలే తప్ప నిర్దేశిత సిలబస్‌తో నిర్వహించే పరీక్షల్లో కాదు. సిలబస్‌ని ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోండి. చదువంటే పరీక్షల కోసం కాదు. మీరు మనిషిగా జీవించినం తకాలం వ్యక్తిగతంగానూ, కుటుంబ, సామాజిక పరంగా అవసరాలను తీర్చు కుంటూ సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవిం చడానికి విద్య ఉపయోగ పడుతుంది. మీరు మీ కోసం చదవండి.

ఆరోగ్యం

డాక్టర్ వి.జానకి,
గైనకాలజిస్ట్, నీలోఫర్ ఆసుపత్రి,
లక్డీకాపూల్, హైదరాబాద్,
ఫోన్ : 9246628629

ఆడుతూ పాడుతూ హుషారుగా ఉండే బాలికల్లో పన్నెండేళ్ల ప్రాయంలో... అకస్మాత్తుగా మార్పులు రావడం సహజం. ఇలా ఎందుకయ్యిందో అని తెలియక తికమకపడతారు. బాలికలు రజస్వల కావడం అంటే గర్భ సంచి, బీజకోశాలు సరిగ్గా ఉన్నాయనడానికి నిదర్శనం. ఇదో జబ్బు కాదు, జీవక్రియలో ఒక భాగం. రజస్వల కావడమంటే... హార్మోనులన్నీ సమతుల్యంగా ఉన్నాయనడానికి సంకేతం.



రజస్వల కావడం సహజం

మనం పుట్టినప్పటి నుంచి మరణించే వరకు శరీరంలోని ఎన్నో భాగాలు పెరుగుతుంటాయి. ప్యూబర్టీ అంటే పిల్లలు యవ్వన దశకు చేరుకోవడం. బాలికలు మహిళల్లా, బాలురు పురుషుల్లా మారతారు. ఈ ప్రక్రియకు సంవత్సరం లేదా ఒక్కోసారి ఆరు సంవత్సరాలు పడుతుంది. ఈ సమయంలో శరీరాకృతిలో మార్పులు వస్తాయి. ఈ ప్యూబర్టీ యవ్వనదశకు దారితీస్తుంది.

ఎలాంటి మార్పులు సంభవిస్తాయి ?

శరీరంలోని హార్మోన్ల వల్ల ఈ మార్పులు కలుగుతాయి. ఎప్పుడు రజస్వల అవుతారో మెదడుకు తెలుసు. ఇది హార్మోన్లను విడుదల చేస్తుంది. వివిధ రకాలైన మార్పులకు అనేక రకాల హార్మోన్లు కారణం అవుతాయి. రజస్వల దశకు వచ్చే సరికి మెదడు, పిట్యూటరీ గ్రంథులు హార్మోన్లను విడుదల చేస్తాయి. ఈ హార్మోన్లు పునరుత్పత్తికి సంబంధించిన భాగాలను నియంత్రిస్తాయి. హార్మోన్లు బాలికల్లోని బీజకోశాన్ని ప్రేరేపించడం వల్ల ఈస్ట్రోజన్, ప్రొజెస్టోన్ వంటి ఇతర హార్మోన్లను విడుదల చేస్తాయి. ఎదుగుదలకు కారణమయ్యే హార్మోన్లు కూడా ప్రేరణకు గురవుతాయి. దీంతో ఎత్తు పెరగడం జరుగుతుంది. కొన్నిసార్లు ఇది చాలా వేగంగా జరుగుతుంది. చేతులు, కాళ్లు పొడవు పెరుగుతాయి. శరీరంలోని అవయవాలు కూడా పెద్దగా అవుతాయి. ఒక్కసారిగా శరీరంలో భారీ మార్పులు వస్తాయి. ఈ మార్పు రెండు నుంచి మూడేళ్ల వరకు ఉంటుంది. ఎదిగే వయసులో కొంత మంది ఏడాదికి నాలుగు అంగులాల ఎత్తు పెరగొచ్చు. దీన్ని 'గ్రోత్ స్పర్ట్' అంటారు. ఈ ఎదిగే సమయం ముగిసిన తర్వాత యవ్వనదశలో ఉండాల్సిన ఎత్తుకు చేరుకుంటారు. ప్యూబర్టీ సమయంలో శరీరం సరిగ్గా వృద్ధి చెందుతుందనడానికి నిదర్శనం ఈ మార్పులు. ఈ సమయంలో బాలికల శరీరాకృతిలో మార్పు కనిపిస్తుంది. బరువు పెరుగుతారు. రొమ్ములు వృద్ధిచెందుతాయి. శరీరంలో కొవ్వు శాతం పెరుగుతుందన్న విషయాన్ని బాలికలు అప్పుడప్పుడు గమనిస్తారు. పీరియడ్స్ వస్తాయి. రక్తస్రావం అవుతుంది. మొదట్లో నెల నెలా పీరియడ్స్ రావు. రెండు, మూడు నెలలకోసారి వస్తాయి. ఈ సమయంలో అధికరక్తస్రావం అవుతుంది. పీరియడ్స్ సరిగ్గా రాకుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ఒక్కోసారి హార్మోన్ల అసమతుల్యం వల్ల కూడా ఇలా జరుగుతుంది. ఇదే కాక కొన్ని రకాల బ్లీడింగ్ డిజార్డర్ వల్ల కూడా ఈ మార్పు కలుగుతుంది. కడుపులో కొద్దిగా నొప్పి ఉంటుంది. కొంత మందిలో వాంతులు, వికారం వస్తాయి. స్కూలు, కాలేజీకి వెళ్లడం సాధ్యం కాదు. మానసికంగా ఆందోళన చెందుతారు. వెంట్రుకలు పెరగడం కూడా రజస్వల కావడానికి చిహ్నమే. చంకల్లో, చేతులమీద, కాళ్లమీద, జననాంగాల దగ్గర వెంట్రుకలు పెరుగుతాయి. ఈ సమయంలోనే ముఖంపై మొటిమలు వస్తాయి. భుజాల కింద ఉండే గ్రంథులను రజస్వలకు కారణమయ్యే హార్మోన్లు ప్రభావితం చేస్తాయి. అందువల్ల శరీరం నుంచి ఒక విధమైన వాసన వస్తుంది. రజస్వల అయినప్పుడు కలిగే భావోద్వేగాలకు హార్మోన్లు బాధ్యత వహిస్తాయి. అంతా గందరగోళంగా ఉంటుంది. మూడ్ మారిపోతుంది. దిగులుగా ఉంటుంది. అతి సున్నితంగా ఉండే వారు వెంటనే నిగ్రహాన్ని కోల్పోతారు. డిప్రెషన్‌కు గురైతే డాక్టర్‌ను సంప్రదించాల్సిందే.

రజస్వల ఎప్పుడు అవుతారు?

బాలికలు 12 నుంచి 15 సంవత్సరాల్లో రజస్వల అవుతారు. కొంత మంది 16 ఏళ్లకు అవుతారు. అప్పటికీ అవ్వకుంటే డాక్టర్‌ను సంప్రదించాల్సిందే. కొంత మంది పదేళ్లకే రజస్వల అవుతారు.

కాకపోవడానికి కారణాలు?

పదహారేళ్లు వచ్చినా రజస్వల కాకుంటే ఏదో కారణముందని భావించాలి. అందులో కొన్ని....
❖ జన్యుపరమైన క్రోమోజోములలో మార్పులు ❖ గర్భసంచి, బీజకోశాలు లేకపోవడం,❖ కొజ్జాలు రజస్వల కారు.❖ టెస్టిస్, బీజకోశాలు కలిసి ఉండడం

ఏం చేయాలి?

బాలికలకు పదేళ్ల నుంచి రజస్వలకావడం పట్ల, శరీరంలో కలిగే మార్పుల పట్ల అవగాహన పెంచాలి. ఇది స్కూళ్లలో జరగాలి. తల్లిదండ్రులూ చెప్పాలి. ఇదో జబ్బు కాదు, జీవక్రియలో ఒక భాగమని వివరించాలి. పీరియడ్స్ సమయంలో రక్తస్రావం కలుగుతుంది కనుక ఐరన్ ఎక్కువగా ఉన్న పళ్లను, కూరగాయలను అధికంగా తీసుకోవాలి. సన్నబడాలని డైటింగ్ చేస్తూ, సమతుల ఆహారాన్ని తీసుకోకపోతే స్థూలకాయం వస్తుంది.

తెర

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలకు సంబంధించిన ఏ చర్చ అయినా కమ్యూనిస్టుల ప్రస్తావన లేకుండా సంపూర్ణం కాదు. సంఖ్యాబలం రీత్యా ఒకనాడు సమరశీల ఉద్యమాల రీత్యా ఈ నాడు కూడా వారి ప్రభావం గణనీయమని ఎవరైనా ఒప్పుకుంటారు. అందులోనూ వీర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం, తర్వాత ఎన్నికల విజయాలు, ఆ పిమ్మట రాష్ట్రావతరణ, దాని సమైక్యతా పరిరక్షణ అన్ని ఘట్టాల్లోనూ కమ్యూనిస్టుల పాత్రను ప్రాధాన్యతను తప్పక చెప్పుకోవలసిందే. ఒకప్పుడు రాష్ట్రంలో ప్రథమ శ్రేణి శక్తిగా వున్న కమ్యూనిస్టు ఉద్యమం తర్వాతి కాలంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు ఏమిటో, అందుకు గాను పాలక వర్గ కాంగ్రెస్ అనుసరించిన క్షుద్ర రాజకీయాలేమిటో మాత్రం చాలా మందికి తెలియవు. అవి తెలియకపోతే ఇప్పుడు రాష్ట్రంలో తెలంగాణా సమస్యతో సహా వివిధ అంశాలపై సాగుతున్న మల్లగుల్లాలు కూడా బోధపడవు. ఆ విషయాలన్నీ ఒక్కచోట పూసగుచ్చినట్టు తెలియజేసే పుస్తకం 'ఆంధ్రప్రదేశ్‌లో ఆరుణ పతాక'.



తెలుగు నాట ఎర్రబావుటా!

ఆ నాటి నుంచి ఆఖరి శ్వాస వరకూ అచంచల కమ్యూనిస్టు యోధుడుగా నిలబడిన మోటూరు హనుమంతరావు కలం నుంచి వెలువడిన రచనల కూర్పు ఇది. పైగా అవి కొత్తగా రాయడం గాక ఆ చారిత్రిక దశల్లోనే వెలువడినవి కావడం ఇంకా విశేషం. సంపాదకుడుగా,చట్టసభల సభ్యుడుగా కూడా ఆయన ఈ ఘట్టాలలో ప్రత్యక్ష పాత్రధారి కావడం వాటి విలువ పెంచుతుంది.

తారీఖులూ దస్తా వేజుల ఇవి కావోయ్ చరిత్ర సారం అన్నట్టుగా ఈ పుస్తకం తేదీల జాబితాగా వుండదు. అలాగని ఘటనల కథనాల పరంపర కూడా కాదు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడుగానూ, శక్తివంతమైన రచయితగానూ ప్రసిద్ధుడైన మోటూరు దాదాపు అరవై ఏళ్ల కాలంలో వివిధ దశల్లో అందించిన అమూల్య అవగాహనాత్మక వ్యాసాలు వ్యాఖ్యానాల మేళవింపు. స్వాతంత్రోద్యమం అన్న రచనతో పుస్తకం మొదలవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటిపరిస్థితులను, ఆ సమయంలో కమ్యూనిస్టుల అవగాహనను తెలియజేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చీరాక ముందే కమ్యూనిస్టులపై సాగిన ఘోర నిర్బంధాలను, నిషేధాలను ఈ వ్యాసం ప్రస్తావిస్తుంది. 1948 నుంచి 1952 వరకూ సాగిన ఈ దమన కాండను గమనించకుండా కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం చెల్లేది కాదని స్పష్టం చేస్తుంది. తర్వాతి కాలంలో కాంగ్రెస్ పార్టీలో వచ్చిన క్షీణ ధోరణుల బీజాలు అప్పట్లోనే కనిపించాయని రచయిత చెబుతారు.

'కడలూరు జైలు జ్ఞాపకాలు' అన్న రెండవ అధ్యాయంలో నరకకూపాల వంటి నాటి జైళ్లలో కమ్యూనిస్టుల పోరాటాలను, బలిదానాలను చెబుతారు. 1949 'మే' లో అరెస్టు అయిన మోటూరు కడలూరు జైలులో వున్నారు. అక్కడ జరిగిన పోరాటంపై పోలీసు కాల్పులలో అనమర్లపూడి సీతారామరావు నేలకొరిగాడు. ఇక సేలం జైలులో మరింత దారుణంగా 19 మంది కమ్యూనిస్టు ఖైదీలు బలైనారు. ఆంధ్ర తెలంగాణా తేడాలు లేకుండా కమ్యూనిస్టులు ఆనాడు ప్రాణాలకు తెగించి పోరాడటమే కాక జైళ్లలోనూ అదే వీరత్వం కొనసాగించారు. వీటన్నిటి ఫలితంగానే ప్రభుత్వం చివరకు దిగి రాక తప్పలేదు.

ఈ నేపథ్యంలో 1952లో అవిభక్త మద్రాసు రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరిగాయి. అప్పటి వరకూ ఘోర నిర్బంధానికి గురైన కమ్యూనిస్టులు కాంగ్రెస్ అంచనాలకు భిన్నంగా ఎన్నికలలో ఘన విజయాలు సాధించారు. ఆంధ్ర ప్రాంతంలోని140 స్థానాల్లోనూ కమ్యూనిస్టులకు 41, వారు బలపర్చిన స్వతంత్రులకు 13 స్థానాలు వచ్చాయి. కాంగ్రెస్ 40 స్థానాలకే పరిమితమైంది. మంత్రులతో సహా ఆ పార్టీ అతిరథ మహారథులంతా కమ్యూనిస్టుల చేతుల్లో మట్టిగర్చారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వానికి ఆ విధంగా తెలుగు ప్రజలు తీర్పు నిచ్చారు. మొత్తం మద్రాసు రాష్ట్రం మీద చూసినా కాంగ్రెస్‌కు 375 స్థానాలకు గాను 152 మాత్రమే వచ్చాయి. ఎన్నికలకు ముందు ఐక్య సంఘటన కోసం కమ్యూనిస్టుపార్టీ ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. కాని ఎన్నికల తర్వాత మాత్రం ప్రకాశం పంతులు నాయకత్వంలోని ప్రజాపార్టీ వగైరాలతో కూడిన సంఘటన 162 మంది సభ్యులతో ఏర్పడింది. అయితే కేంద్రంలోని నెహ్రూ ప్రభుత్వం ప్రభుత్వ స్థాపనావకాశం ఇవ్వకుండా రాజగోపాలాచారిని దొడ్డి దోవన ముఖ్యమంత్రిని చేసింది. దేశానికి గవర్నర్ జనరల్‌గా పనిచేసిన రాజాజీని శాసనమండలికి నామినేట్‌చేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రతిష్టించడం నిజంగా సిగ్గుచేటైన విషయం. తర్వాత రాజాజీ కుట్రలు కుయుక్తులతో ఐక్య సంఘటనను విచ్ఛిన్నం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు, పూర్వాపరాలు మోటూరు అత్యంత చక్కగా పొందుపర్చారు. బహుశా ఈ సమాచారం మరెక్కడా దొరక్కపోవచ్చు.

తర్వాతి భాగంలో ఆయన ఆంధ్ర రాష్ట్రోద్యమ పరిణామాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో ప్రకాశం పంతులు నుంచి ప్రధాని నెహ్రూ వరకూ ఎలా వ్యవహరించిందీ సోదాహరణంగా చెప్పారు. పొట్టి శ్రీరాములు అమరణ నిరశనపట్ల కాంగ్రెస్ ఉదాసీనతను వెల్లడించారు. చివరకు ఆయన ప్రాణబలి తర్వాత ఉద్రిక్తతల మధ్యనే రాష్ట్రం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ దశలో రాజధాని ఎక్కడుండాలనేదానిపై సాగిన అవకాశవాద విన్యాసాలను 'రాజధాని రభస'లో వివరించారు. కమ్యూనిస్టుల కేంద్రం అనే ఒకే ఒక్క కారణంతో విజయవాడ రాజధాని కాకుండా కాంగ్రెస్ నాయకులు, తెన్నేటి విశ్వనాథం వంటివారూ చేతులు కలిపిన వైనాన్ని

తెలిపారు. ఇక చివరగా జులై 14న మద్రాసు శాసనసభలో ఆంధ్ర రాష్ట్ర బిల్లు చర్చలో చేసిన ప్రసంగపాఠం ఇచ్చారు. కమ్యూనిస్టు శాసనసభ్యులు గణనీయంగా వున్నందువల్లనే ఈ బిల్లు వచ్చిందనే వాస్తవాన్ని నొక్కివక్కాణించారు.

నాల్గవ అధ్యాయంలో అప్పటి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధ విధానాలపైన, అపసవ్య పోకడలపైన శాసనసభలో చేసిన ప్రసంగాలున్నాయి. ఈప్రసంగాల పట్ల కాంగ్రెస్ నాయకులు అసహనంతో అద్భుతగిలిన వుదంతాలు కూడా చూస్తాం.

'శుభోదయం -ఆంధ్ర ప్రదేశ్ అవతరణ' అన్న అయిదవ అధ్యాయం ప్రస్తుత పరిణామాల రీత్యా చాలా కీలకమైంది. 1969లో తెలంగాణా ప్రాంతంలోనూ, 1972లో కోస్తా జిల్లాలలోనూ వచ్చిన వేర్పాటు వాద ఉద్యమాల నేపథ్యంలో పాలకపక్షీయుల అవకాశవాద పోకడలను పదవీ వ్యామోహాలను మోటూరు కూలంకషంగా వివరించారు. అంతేగాక తెలుగు భాష జాతి ఒకటేనన్న చారిత్రిక సత్యాన్ని మార్చిస్తు అవగాహనతో విశ్లేషించారు. కొద్ది పేజీలలోనే గొప్ప అవగాహన కలిగిస్తారు. అప్పటికి ఏర్పడిన చిన్న రాష్ట్రాల అనుభవాలనూ, చీలిపోవడం వల్ల కలిగే దుష్ఫలితాలను కళ్లకు కట్టారు. అప్పట్లో చెన్నారెడ్డి, బివిసుబ్బారెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు అటూ ఇటూ చేసిన వాదనలను చూస్తే ప్రస్తుత పరిస్థితులే గుర్తుకొస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లాగే వేర్వేరు మలబారు, తిరువనంతపురం, కొచ్చిన్ అనే మూడు ప్రాంతాల కలయికగా ఏర్పడిన కేరళ కమ్యూనిస్టుల ప్రభావంతో సమైక్యంగా వర్ధిల్లుతున్న ఉదాహరణను పోల్చిచూపించారు. అప్పట్లో ముందుకొచ్చిన ముల్కీ, ఆరు సూత్రాల పథకం వంటి అంశాలను కూడా చర్చించారు. అప్పట్లో సిపిఐ అనుసరించిన విధానాలను కూడా పరిశీలించారు. 'విషాదఛాయలు' అన్న చివరి భాగంలో జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా ఎదురైన కష్టనష్టాలను వివరించారు. 1973 మార్చి లో రాసిన ఈ వ్యాసాలు రాజకీయ విద్యార్థులందరికీ అవశ్య పఠనీయాలు.

'ప్రకాశం పంతులు గారితో నా పరిచయం' అన్న వ్యాసం కూడా వీటిలో భాగమే. మెరీనా బీచ్‌లో తెల్లదొరల తుపాకికి గుండెను చూపి ఆంధ్ర కేసరి అనిపించుకున్న ప్రకాశం రాజకీయ జీవితపు ఇతర పార్శ్వాలు కూడా ఇందులో చూడగలం.

7,8,9 అధ్యాయాలు ఈ పుస్తకం టైటిల్‌కు చక్కగా అతికేవి. రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ ఆవిర్భావం, అభివృద్ధి తదితర పరిణామాలను సమాచార సంపన్నంగానూ సముత్తేజపూరితంగానూ వీటిలో తెలుసుకోగలుగుతాము. నాణేనికి మరోవైపు అన్నట్టుగా 10,11 అధ్యాయాల్లో కాంగ్రెస్ క్షుద్రరాజకీయ సంస్కృతిని, రాష్ట్రంలో అది క్రమేణా పతనమవడానికి కారణాలను చూడగలం. 1978-83 మధ్య వరుసగా ముఖ్యమంత్రులను మార్చడం, 1988లోనూ, 1991లోనూ వంగవీటి రంగా, రాజీవ్‌గాంధీల రాజకీయ హత్యలను సాకుగా చూపి విధ్వంసకాండ సాగించడం తదితర పరిణామాలను వివరాలతో సహా ఇచ్చారు. ఇవన్నీ కాంగ్రెస్ అసలు రంగు తెలుసుకోవడానికి మచ్చిపోరానివే. ఇవే గాక కారంచేడు హత్యాకాండ అనంతర పరిణామాలు, హైదరాబాద్ మతకలహాలతో సహా మరికొన్ని అంశాల విశ్లేషణ కూడా వుంటుంది. 'సిపిఎం సింహావలోకనం'తో ముగుస్తుంది.

రాజకీయ ఆసక్తి గలవారు, మీడియా వర్గాలు, కొత్తతరాల కమ్యూనిస్టులు తప్పక చదవాల్సిన పుస్తకాల్లో ఇది ఒకటని నిస్సందేహంగా చెప్పొచ్చు. విషయ పరిజ్ఞానానికే గాక విశ్లేషణా శైలి రీత్యా కూడా ఇది చదవడం అవసరం.

ఆంధ్రప్రదేశ్‌లో
అరుణ పతాక
మోటూరు హనుమంతరావు
సంకలనం: వి. ఆర్. బొమ్మారెడ్డి
వెల: 20/-,
పేజీలు:208,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్.









సీరియల్

మూలం: బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

అమెరికన్ ప్లేగ

సిట్టింగ్‌బుల్

జరిగిన కథ:

చిల్లరమల్లర తగవులకు కాలం చెల్లింది. కొద్ది మంది సైనికులకూ, స్థానికులకూ జరిగే యుద్ధాలు కావివి. అత్యంత శక్తిమంతమైన ప్రభుత్వ దళాలు సాయుధులైన వేలాది సైనికులు - శత్రువుతో చేసినట్టు వ్యూహాలు రచించి ఇండియన్లు కనిపిస్తే చాలు విచక్షణా రహితంగా తుడిచిపెట్టటానికి సన్నద్ధమయ్యారు. అంతకు ముందే, డిసెంబర్‌లో వార్తాహరులు, స్థానిక అధికారులకు సమాచారం అందించటానికి వెళ్ళినప్పుడు మైదానాలన్నీ మంచు దుప్పటి కప్పుకొని ప్రయాణం అనుకూలించలేదు. తీవ్రమైన చలీ, తుపానులూ, భరించి గూఢచారులు సమాచారం చేరవేసేనాటికి జనవరి 31 డెడ్‌లైన్ దాటిపోయింది. మరోవైపు, సైన్యం వస్తున్నదని తెలిసినా, ఇండియన్లు కనీసం స్త్రీలను, పిల్లలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయారు. ధైర్యం చేసి ప్రయాణమైన వాళ్ళు, చలిలో చిక్కుకుని, ఆకలితో మరణించారు. అమెరికన్ల అధీనంలో ఉన్న రిజర్వేషన్‌లో కూడా ఆహార నిల్వలు నిండుకున్నాయి.

(46వ భాగం)

సైన్యానికి భయపడి ఇండియన్లు లొంగి పోతారనుకున్నది ప్రభుత్వం. జనవరి 31 నాటికి చర్చలకు రావాలని అల్టిమేటం ఇచ్చింది. ప్రాణనష్టం కాకుండా ఒక దేశాన్ని జయించటానికి ఇంతకన్న మంచిమార్గమే ముంటుంది? కనీసం కొన్ని తెగలన్నా లొంగిపోయేవేమో. కాని చలి తీవ్రతకు భయపడి ఎవరూ తన గుడారాల్లోంచి కదలలేదు. చలి తగ్గిన వెంటనే సైన్యం దాడులు ప్రారంభించింది. "మూన్ ఆఫ్ ది స్నో బ్లైండ్" రుతువులో ఫోర్ట్ ఫెటర్‌మాన్ నుండి జనరల్ క్రూక్, బోజ్‌మాన్ రోడ్‌ను తన అధీనంలోకి తీసుకున్నాడు. పదేళ్ళక్రితం, ఇక్కడే రెడ్‌క్లౌడ్ తెల్లవాళ్లను తరిమికొట్టాడు.

అదే సమయంలో, ఆకలితోవున్న షెయెనీలూ, ఓగ్లాలాలూ, సియోలూ ఈ దున్నలు, దుప్పులు దొరుకుతాయని పౌడర్‌నదివైపు వేటుకు బయల్దేరారు. మార్చి రెండో వారం వరకు వాళ్ళు లిటిల్ పౌడర్‌నది, పౌడర్‌నదిలో కలిసే చోటుకు చేరుకున్నారు. క్రేజీ హార్స్ గ్రామం నుండి వచ్చిన టూమూన్, లిటిల్‌వూల్ఫ్, ఓల్డ్ బేర్, మేపుల్ ట్రీ, వైట్‌బుల్, ఇతర షెయెనీ నాయకులూ ఆ బృందంలో వున్నారు.

మార్చి 17 నాటి ఉదయం, కల్నల్ జోసెఫ్ జె. రేనాల్డ్స్ నాయకత్వంలో, క్రూక్ దళాలు నిద్రిస్తున్న వీళ్ల మీద మెరుపుదాడి చేశాయి. తమ దేశంలో తమమీద దాడి జరుగుతుందని ఊహించలేదు ఇండియన్లు. కళ్ళు తెరిచేలోగా కెప్టెన్ జేమ్స్ ఎగాన్, మరి కొందరు సైనికులూ టెపీ చీల్చుకుని లోనికి ప్రవేశించారు. ఏమి జరుగుతుందో కూడా తెలియదు. తుపాకులు, పిస్టోళ్ల మోతతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. అదే సమయంలో పడమటి నుండి మరో దళం దాడి చేసింది. రహస్యంగా వచ్చిన మూడో అశ్వికదళం గుర్రాలను అపహరించుకుపోయింది.

స్త్రీలను, పిల్లల్నీ రక్షించటం ప్రథమ కర్తవ్యం. సైనికులు దుర్మార్గులు. వాళ్లకు మంచి చెడులు తెలియవు. అన్ని వైపుల నుండీ బుల్లెట్లు దూసుకు వస్తున్నాయి.

"పరిగెత్తలేని వృద్ధులు భయంతో ఒకరి మీద ఒకరు పడ్డారు. అనేక మందికి గాయాలయ్యాయి. కొందరు యువకులు మాత్రం చేతికి దొరికిన ఆయుధంతో శత్రువు నెదిరించారు" అంటూ ఆనాటి సంఘటనను నెమరేసుకున్నాడు వుడెన్ లెగ్. యుద్ధం చెయ్యలేనివాళ్ళు కొండల్లోకి పారిపోయారు. యోధులు బండరాళ్ల వెనక నక్కి ఎదురు దాడి ప్రారంభించారు. యుద్ధంలో, సైనికులను నిలువరించటం వల్లనే స్త్రీలూ, పిల్లలూ తప్పించుకోగలిగారు.

"మా గ్రామం నేలమట్టం కావటం కళ్లారా చూశాను. ఒక్క టెపీ కూడా మిగలకుండా తగలబెట్టారు. మాకు ఒంటిమీది (తోలు) బట్టలు తప్ప మరేమీ మిగల్లేదు. సైనికులు షెమ్మికన్ (దంచి ఎండ బెట్టుకున్న మాంసం) నిల్వలు పూర్తిగా ధ్వంసం చేశారు. గుర్రపు జీనులను చించేశారు. గుర్రాలను తరలించుకుపోయారు". గుర్రాలు లేకుండా ఇండియన్లు బతకలేరు. ఆ రాత్రి సైనికులు బస చేసిన చోటికెళ్లి, "బయట కట్టేసి ఉన్న గుర్రాలు తిరిగి తెచ్చుకున్నాం" అని చెప్పారు టూమాన్.

ఈ విషయం తెలిసిన జనరల్ క్రూక్ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. అశ్రద్ధకు, అసమర్ధతకు గాను కల్నల్ రేనాల్డ్స్ మీద కోర్ట్ మార్షల్‌కు ఆదేశించాడు. ఆర్మీ రికార్డుల్లో దీన్ని "క్రేజీ హార్స్ గ్రామం మీద దాడి"గా పేర్కొన్నారు. కాని ఈ దాడి సమయంలో క్రేజీ హార్స్ కొన్ని మైళ్ల దూరంలో మరో చోట ఉన్నాడు. సైనికుల బీభత్సం తర్వాత, టూమూన్ ఇతరులూ కాలినడకన ప్రయాణం ప్రారంభించారు. మూడు రోజులు గడిచినా నివాసయోగ్యమైన స్థలం కనిపించలేదు. రాత్రి సబ్ జీరో టెంపరేచర్‌కు తట్టుకోలేక, కాళ్లకు బొబ్బలొచ్చాయి. కప్పుకోవటానికి జంతువుల తోళ్ళు కూడా లేవు. ఒక్కొక్కరే, ఆకలితో తూలి పడిపోయారు.

తన వద్దకు వచ్చిన అతిథులకు వీలైనంతలో క్రేజీ హార్స్ ఘనస్వాగతం పలికాడు. భోజనం పెట్టి దుస్తులిచ్చాడు. ఓగ్లాలాలా టెపీలలో పడకలు ఏర్పాడు చేశాడు. "మీరు రావటం చాలా సంతోషంగా ఉంది. అందరం కలిసి సైనికులనెదిరిద్దాం" అని ధైర్యం పలికాడు.

"ఇంక యుద్ధం తప్ప మరేం మిగిలింది? ఉన్నదంతా పోగొట్టుకున్నాం. మావాళ్లు మరణించారు. గుర్రాలను తీసుకుపోయారు. ఇది మన చివరి పోరాటం" అన్నాడు టూమూన్.

'గీస్ లేయింగ్ మూన్' (రుతువు)లో గడ్డి ఏపుగా పెరిగింది. బలిసిన గుర్రాలు చెంగు చెంగున గంతులు వేశాయి. క్రేజీ హార్స్ తన ఓగ్లాలాలూ, షెయెనీలతో, టంగ్ రివర్ వద్ద బస చేసిన హంక్‌పాపా క్యాంపుకు చేరుకున్నాడు. చలికాలమంతా సిట్టింగ్ బుల్ అక్కడే గడిపాడు. మరి కొద్ది రోజుల్లోనే మిన్నెకాంజుల లేమ్‌డీర్ కూడా అక్కడికి చేరుకున్నాడు. సైన్యం కదలి

వస్తుందన్న పుకార్లు బలంగా వినిపిస్తున్నాయి. సిట్టింగ్ బుల్‌తో కలిసి వుంటే క్షేమం.

వేసవి కాలం ప్రవేశించింది. వేట కోసం తెగలన్నీ వుత్తరంగా కదిలాయి. దారిలో బ్రూల్స్, సాన్స్ ఆర్స్, బ్లాక్ ఫుట్ సియోలు, మరింత మంది షెయెనీలు కూడా వీళ్ళతో కలిశారు. 'ఒప్పందం' ప్రకారం రిజర్వేషన్‌లో వున్న ఇండియన్లకు కూడా వేట హక్కులున్నాయి. అందువల్ల (లొంగిపోవాలని) ప్రభుత్వం జారీ చేసిన జనవరి 31 అల్టిమేటం ఓ 'బెదిరింపు' మాత్రమే అనుకున్నారు. తెల్లవాళ్ల ఏజెంట్లు తమనిలా తరచూ భయపెడుతూనే వుంటారు. "సైనికులను ఎదిరించకండి, వాళ్లతో తగాదా పడొద్దు" అంటూ వాదించారు తెగలలోని వృద్ధ నాయకులు.

వేలాదిగా సంచరిస్తున్న తెగల్లో మరి కొందరు యువకులు కూడా వచ్చి చేరారు. వాళ్ళందరూ యుద్ధానికి వుబలాటపడుతున్నారు. అన్ని వైపులనుండీ సైన్యం కదిలివస్తున్నదన్న వార్తలు చేరుతున్నాయి. జనరల్ క్రూక్ దక్షిణం నుండీ, కల్నల్ జాన్ గిబ్బన్ (ఈయనను ఇండియన్లు "ది వన్ హూ లింప్స్" అంటారు) పశ్చిమం నుండీ, జనరల్ టెర్రీ, లాంగ్ హెయిర్ కస్టర్‌లు తూర్పు నుండీ వస్తున్నారు.

'మూన్ ఆఫ్ మేకింగ్ ఫాట్' (రుతువు)లో హంక్‌పాపాలు సన్ డాన్స్ కోసం సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. సిట్టింగ్‌బుల్ మూడు రోజులు వరుసగా నాట్యం చేశాడు. నెత్తురు కారింది. సూర్యుణ్ణి నేరుగా చూసి కళ్ళు తిరిగి పడిపోయాడు. కాసేపటికి మూర్ఛ నుండి తేరుకొని, ఏదో శక్తి ఆవహించిన వాడిలా ప్రవర్తించాడు. "ఆకాశంవైపు చూసినప్పుడు, సైనికులు శిలాజాల్లా రాలిపోతున్నట్టు కనిపించారు. తలకిందులుగా పడిపోయారందరూ. వాళ్ల హ్యాట్లు గాలిలో ఎగిరిపోయాయి. తను అరుస్తున్నా వాళ్లకు వినిపించటం లేదు. అందరూ ఇండియన్ క్యాంపులోనే కుప్పగా కూలిపోతున్నారు. గ్రేట్ స్పిరిట్ వాకాంటకా వల్ల, తెల్లవాళ్లను చంపగలిగిన శక్తిని పొందారు ఇండియన్లు.

కొన్నాళ్లకు జంతువులను తరుముతున్న షెయెనీలకు, రోజ్ బడ్ వద్ద రాత్రికి విడిది చేసిన సైనిక పటాలం కనిపించింది. ఇండియన్లు వెనుతిరిగి వచ్చి క్యాంపులో తమ వాళ్లకీ విషయం చెప్పారు. అయితే అప్పటికే కొందరు కిరాయి (మెర్సెనరీ) ఇండియన్ల ద్వారా (క్రో, షోషోన్ తెగలవాళ్ళు) వీళ్ళ గురించి సమాచారం సేకరించాడు జనరల్ క్రూక్.

ఘర్షణ తప్పేటట్టు లేదు. తెగల నాయకులందరూ అత్యవసర సమావేశం జరిపారు. సగం మంది యువకులు గ్రామాలను రక్షించారు. మిగిలిన వాళ్ళు రాత్రికి రాత్రే సైనికుల మీద దాడి చెయ్యాలి. సుమారు వెయ్యిమంది షియోలు, షెయెనీలతో ఒక పార్టీ ఏర్పాటు చేసి ముందుకు కదిలారు. కొందరు స్త్రీలు వెంట వచ్చారు. నాయకులు సిట్టింగ్‌బుల్, క్రేజీ హార్స్, టూమూన్ ఈ పార్టీకి నాయకులు. సూర్యోదయానికి ముందు కాస్త విశ్రాంతి తీసుకొని, గుర్రాలకు నీళ్ళు పట్టి, కొండలు దిగి, ఆర్మీ క్యాంపువైపు దూసుకుపోయారు. మెర్సెనరీలిచ్చిన సమాచారంతో, క్రూక్ సైనికులు ఇండియన్ గ్రామాలను స్వాధీనం చేసుకోవటానికి బయల్దేరారు. మంచు కరిగి, నేల మీద ఎండ మెరుస్తున్నది. లేత ఎండ వెచ్చగా వుంది. ఒక కాలువ దగ్గర ఇరుపక్షాలూ ఎదురు పడ్డాయి. మొదట సియోలూ, షెయెనీలూ, సైనికులను తరిమి కొట్టారు. కాని కొద్ది నిమిషాల్లోనే బ్లూకోట్స్ ఎదురుదాడి చేశారు.

తన యుద్ధ పాటవాన్ని పరీక్షించుకోవాలని చాలా కాలంగా వుబలాట పడుతున్నాడు క్రేజీహార్స్. మంచి అవకాశం దొరికింది. ఫోర్ట్ ఫిల్ కియర్నీ వద్ద ఫెట్టర్‌మాన్ పోరాటం నాటి నుండీ బ్లూకోట్స్ సైనికుల ఎత్తుగడలను అధ్యయనం చేశాడు. "గ్రేట్ స్పిరిట్"ను ఆవాహన చేసుకోవటానికి బ్లాక్‌హిల్స్‌కు వెళ్ళిన ప్రతిసారీ, తెల్లవాళ్లను చిత్తుగా ఓడించటానికి ఓగ్లాలాలకు శక్తినిమ్మని 'వాకా టంకా' ను వేడుకున్నాడు. 'గ్రేట్ స్పిరిట్' రాజ్యం చేస్తున్న నిజమైన లోకానికి నీడ లాంటిదీ భూప్రపంచం అని చిన్ననాటి నుండీ గట్టిగా నమ్మాడు క్రేజీహార్స్. కలలు కనగలిగే శక్తి వున్నవాళ్ళే ఆ స్వప్నలోకంలో విహరించగలిగారు. అదే సత్యం. అక్కడ ఏదీ స్థిరంగా వుండదు. కనిపించని నీటి మీద తేలుతున్నట్టుగా, నాట్యం చేస్తున్నట్టుగా వుంటుంది దృశ్యలోకం. వాకాటంకా ఆవహించినప్పుడు అతడి గుర్రం నాట్యం చేస్తుంది. అందువల్లే క్రేజీహార్స్ అని పేరు పెట్టుకున్నాడు. భూమ్మీద యుద్ధం చెయ్యటానికి ముందు, స్వప్నలోకంలో 'వాకాటంకా' ను ప్రసన్నం చేసుకొని వస్తే విజయం తథ్యమని కూడా గట్టిగా విశ్వసించాడు.

1876, జూన్ 17 నాడు, కలలలోకం నుండి తిరిగి వచ్చి, అంతకు ముందెప్పుడూ ఎరుగని యుద్ధ విన్యాసాలు ప్రదర్శించి సియోలను ఆశ్చర్యపరిచాడు. ఒక్క మనిషి పదిమందిలాగ పోరాడొచ్చు. యోధుడే ఆయుధంగా దూరి శత్రువులను సంహరించాలి. క్రూక్ సైనికులు దాడి చేసినప్పుడు, గుళ్ల వర్షాన్ని తప్పించుకుని, శత్రువుల సమీకరణ బలహీనంగా వున్న చోట దెబ్బతీశారు సియోలు. మెరుపు వేగంతో కదులుతూ ఎక్కడ చూసినా, తన గుర్రం మీద దర్శనమిచ్చాడు క్రేజీహార్స్. మధ్యాహ్నం వరకు బ్లూకోట్స్ వ్యూహం బెడిసి కొట్టింది. మూడు వరుసల్లో ఎటాక్ చెయ్యటం వాళ్ల కలవాటు. కాని క్రేజీహార్స్ యోధులు తమను అన్ని వైపుల నుండీ ఎటాక్ చెయ్యటం వల్ల చెల్లాచెదుర్చై, సైనిక దళంలా యుద్ధం చెయ్యటానికి ఎవరికి వారే ఆత్మరక్షణలో పడ్డారు. అలా మూడు సార్లు వాళ్లను దెబ్బతీశాడు క్రేజీహార్స్. అశ్వికులకు యుద్ధపాటవం ఎక్కువగా వుండొచ్చుగాక, కాని గుర్రాలు చెప్పినట్టే వాళ్లు వినాలి. క్రేజీహార్స్ యోధులు, సైనికులకు బదులు, వాళ్ల గుర్రాలను గురి చూసి కాల్చారు. అవి భయంతో అటూ ఇటూ పరిగెత్తి రౌతులను కిందపడవేసి గాయపర్చాయి. బ్లూకోట్స్ దాడిని తట్టుకోలేమనుకున్నప్పుడు, సియోలు తాత్కాలికంగా వెనక్కి తగ్గి, వాళ్ళు వెంటబడినప్పుడు తిరిగి ఎటాక్ చేశారు.



టూమూన్

ఆ రోజు, షెయెనీలు కూడా గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించారు. 'ఛీఫ్ -కమ్స్ - ఇన్ సైట్' (పేరు) ఆనాటి వీరుడు. శత్రువులకు బాగా నష్టం చేకూర్చి, కమాండర్‌వైపు దూసుకుపోతున్నప్పుడు అతడి గుర్రానికి బులెట్ తగిలి నేలకూలింది. అప్పుడే మరో 'వీరుడు' వచ్చి అతడిని తన గుర్రం మీదికి లాక్కుని 'రక్షించాడు'. ఆ 'వీరుడే' అతడి సోదరి. 'బఫెలో -కాఫ్ - రోడ్ -వుమెన్'. నిజానికామె యుద్ధం చెయ్యటానికి రాలేదు. గుర్రాల అవసరాలు చూడటానికొచ్చి సోదరుణ్ణి కాపాడింది.

ఆ రోజు, షెయెనీలు కూడా గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శించారు. 'ఛీఫ్ -కమ్స్ - ఇన్ సైట్' (పేరు) ఆనాటి వీరుడు. శత్రువులకు బాగా నష్టం చేకూర్చి, కమాండర్‌వైపు దూసుకుపోతున్నప్పుడు అతడి గుర్రానికి బులెట్ తగిలి నేలకూలింది. అప్పుడే మరో 'వీరుడు' వచ్చి అతడిని తన గుర్రం మీదికి లాక్కుని 'రక్షించాడు'. ఆ 'వీరుడే' అతడి సోదరి. 'బఫెలో -కాఫ్ - రోడ్ -వుమెన్'. నిజానికామె యుద్ధం చెయ్యటానికి రాలేదు. గుర్రాల అవసరాలు చూడటానికొచ్చి సోదరుణ్ణి కాపాడింది.

షెయెనీల కిది 'బ్యాటిల్ వేర్ ది గర్ల్ సేవ్డ్ హర్ బ్రదర్". అమెరికన్ల ప్రకారం "బ్యాటిల్ ఆఫ్ ది రోజ్ బడ్". సూర్యాస్తమయంతో యుద్ధం ఆగింది. ప్రాణాలకు తెగించి పోరాడామని ఇండియన్లకు తెలుసు. కాని క్రూక్ దళాల మీద చావు దెబ్బ తీశామని వూహించలేదు. తెల్లారి కొండల్లో తిరిగిన షెయెనీలకు వెనుతిరిగి దక్షిణ దిశగా కదిలిపోతున్న బ్లూకోట్స్ కనిపించారు. అదనపు దళాల కోసం గూస్ క్రీక్ వద్ద వున్న బేస్ క్యాంప్ కెళ్లాడు జనరల్. గిబ్బన్, టెర్రీ లేదా కస్టర్ తమ సైనికులను పంపిస్తే తప్ప, తనొక్కడూ ఇండియన్లతో యుద్ధం చెయ్యలేదు.

రోజ్‌బడ్ సంఘటన తర్వాత, షెయెనీలు గ్రేజీగ్రాస్ (లిటిల్ బిగ్ హార్న్) వద్ద సమావేశమయ్యారు. పశ్చిమ మైదానాలలో దుప్పుల మందలు పుష్కలంగా వున్నాయనీ, బాగా పెరిగిన గడ్డి గుర్రాలకు మేతగా పనికొస్తుందనీ వార్తాహరులు కొత్త సమాచారమందించారు. ఇంకేం కావాలి. తమ సమస్యలన్నీ తీరినట్టే. మూడు మైళ్లు నడిచి ప్రెయిరీ చేరుకున్నారు షెయెనీలు. వీళ్ళ సంఖ్య మనకు ఖచ్చితంగా తెలియదు గాని, మూడు వందల మంది యోధులతో కలిసి, కనీసం వెయ్యికి తగ్గకుండా వుండి వుంటుంది. "అక్కడ లెక్కలేనన్ని టెపీలు వేసు కున్నారు" అని జ్ఞాపకం చేసుకున్నాడు బ్లాక్ ఎల్క్.

ఇంకా వుంది....

సినిమా కబుర్లు

చందు

'గమ్యం' చూస్తే ఒక మంచి పుస్తకం చదివినట్లే...

దర్శకుడు 'క్రిష్' కబుర్లు



రాబర్ట్ ప్రిసిగ్ రాసిన 'జెన్ అండ్ ద ఆర్ట్ ఆఫ్ మోటార్ సైకిల్ మెయింటనెన్స్' ఈ కథకు చాలా ఉపయోగపడింది. గమ్మత్తైన, అద్భుతమైన పుస్తకం అది. రోజూ పొద్దున్నే బైక్ తుడుచుకుని, ఇంజన్ ఆయిల్ ఎలా ఉందో కనిబెడుతూ ఉండేవాడు తన జీవితాన్ని కూడా అంతే జాగ్రత్తగా చూసుకుంటాడని రచయిత ఆ పుస్తకంలో రాశారు. 'ఎ.సి కారులో వెళ్తున్నాం. అంటే... మనం ఎయిర్(గాలి)ని కండిషన్ చేస్తూ వెళ్తున్నాం. ఎ.సి అంటే అసహజమైన వాతావారణం అన్నమాట. బైకుమీద వెళితే...ఎండలో ఎండుతాం... వానలో తడుస్తుంటాం... సహజసిద్ధ వాతావరణంలో ప్రయాణిస్తున్నట్లు...' పుస్తకంలో ఈ అంశాన్ని రచయితకు చెబితే అద్భుతమైన డైలాగ్స్ రాశారు. 'కారు అద్దం లోంచి చూస్తున్నావ్. అద్దం తీసి చూడు... ప్రపంచం అంటే ఏంటో తెలుస్తుంది' అని హీరోయిన్ అంటుంది. చిత్రంలో గుర్తుండిపోయే డైలాగ్స్ ఉన్నాయి. అందుకే 'గమ్యం' చూస్తే ఒక మంచి పుస్తకం చదివినట్లు ఉంటుంది. సినిమాల్లో నటించాలన్న ఉద్దేశం ఎప్పుడూ లేదు. 'గమ్యం'లో నక్సలైట్ నాయకుడిగా నటించానంటే... అప్పట్లో నాకు పొడవాటి జుట్టు, గడ్డం ఉండేది. ఆర్టిస్ట్ రాకపోతే తప్పనిసరి పరిస్థితిల్లో నటించాల్సి వచ్చింది.

వేయి చేతులు పుట్టుకొస్తాయి

చిత్రంలో 'థౌజెండ్ హ్యాండ్స్ డాన్స్' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చైనీస్ డాన్స్ నుంచి స్ఫూర్తి పొంది ఇందులో పెట్టాం. సుచిత్రా చంద్రబోస్ డాన్స్ కంపోజ్ చేశారు. దీనికి ఒక ఫిలాసఫీ కూడా ఇచ్చాం. 'గుండెల్లో కొద్దిగా ప్రేమ ముంటే... మనకవసరమైన్పుడు చేయూత ఇవ్వడానికి వేయి చేతులు పుట్టుకొస్తాయి' అని చెప్పే ప్రయత్నం చేశాం.

'మనిషంటే భలే చెప్పాడ్రా...'

రీరికార్డింగ్ జరగక ముందు కె.రాఘవేంద్రరావుగారు చిత్రాన్ని చూసి ఆరు పేజీల నోట్స్ రాశారు. తొలి డైలాగ్‌తో డైరెక్టర్‌గా సక్సెస్ అయ్యావన్నారు. ప్రతి రీలూ విశ్లేషించి ఇలా ఉండే బాగుండేది... అలా ఉంటే బాగుండేదని సలహాలిచ్చారు. హైదరాబాద్ దేవి థియేటర్‌లో సినిమా చూసి బయటికొస్తున్నాం. నెట్టుకుంటూ ముందుకు జరుగుతున్నాం. ఎవరో ఒకతను 'ఈ నా కొడుకెవరో పుస్తకాలు తెగ చదివాడ్రా... మనిషంటే భలే చెప్పాడు...' అని కామెంట్ చేశాడు. మనిషంటే ఎలా ఉండాలో చెప్పలేదు. కానీ మనిషంటే నమ్మకముండాలి... ఇచ్చి పుచ్చుకోవాలి... ఏడ్వాలి, నవ్వాలి... అని నాకు తెలిసిన పరిధిలో సినిమాటిక్‌గా చెప్పాను. 'మనిషంటే భలే చెప్పాడ్రా' అనగానే ఎందుకో తెలీని భావోద్వేగం చోటుచేసుకుంది.

భయంతో పాటు బాధ్యతా పెరిగింది

'గమ్యం' సక్సెస్‌తో తదుపరి చిత్రం పట్ల భయంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. ఒళ్ళు దగ్గర పెట్టుకుని కమర్షియల్ అంశాలతో మానవతా విలువలున్న సినిమానే మళ్ళీ తీస్తాను.

సామ్యవాదానికి దగ్గరగా నా భావాలు

చేగువేరా గురించి విప్లవ కథలు చిన్నప్పుడే చదివాను. ఆయనకు వీరాభిమానిని. మీకు నచ్చే రియల్ హీరో ఎవరంటే? ఓన్లీ ఒన్ 'చేగువేరా'. 'గమ్యం'లో నక్సలైట్ నాయకుడిగా నా గెటప్ కూడా ఆయన్ని పోలి వుంటుంది. ఎగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినా సామ్యవాద భావాలకు దగ్గరగా నా భావాలుంటాయి. సినిమాలు తీస్తూ ఉండడమే నా గమ్యం. ప్రయాణం మొదలుపెట్టాను. నాలుగు సంవత్సరాలుగా సినిమానే లోకంగా బతుకుతున్నాను.. డైరెక్టర్‌గా గమ్యం చేరానని చెప్పనుగానీ... అసలు జీవించడమే ఓ 'గమ్యం'.

'గమ్యం' విజయంతో నాన్నగారు చాలా సంతోషంగా ఉన్నారు. సినిమా రిలీజ్ అయిన తర్వాత పెళ్ళి చేసుకుంటానని అమ్మకు మాటిచ్చాను. ఇక పెళ్ళి చేసుకోవడమే తరువాయి. 'సింగిల్ రెడీ టు మింగిల్' అన్న మాట.





పోలికలు

కూతురు: అమ్మా! నువ్వు నేను ఒకరి పక్క ఒకరు నడిచి బజారులో వెళ్తూ ఉంటే.... తల్లీకూతురు కాదు! అక్కా చెల్లెళ్లు అనుకొంటున్నారు... ఈ సంగతి మా ఫ్రెండ్స్ ఇప్పటికి నాలుగు సార్లు చెప్పారు!!!

తల్లి: అవునా! నాకు మన చుట్టు పక్కల వాళ్ళు మరో సంగతి చెప్పారు! మీ నాన్న, అన్నయ్య కలిసి వెళ్తుంటే అన్నయ్యేమో నాన్న అనీ- నాన్నేమో అన్నయ్య అని కొందరు అనుకుంటున్నారట!

కళ్ళల్లో కళ్ళు

రామ్: కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడవెందుకు?
రాణి: కళ్ళ కలక వస్తుందని భయం.

చూసి నేర్చుకో...

తండ్రి: పరీక్షల్లో తప్పావు. సిగ్గులేదురా! ఎదురింటి అమ్మాయిని చూసయినా నేర్చుకో రాదు.
కొడుకు: ఆ...రోజూ చూసీ చూసే ఇలా అయ్యాను.

కర్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్ఎన్ పాడు, ప్రకాశం.

విచిత్ర వార్తలు

విచిత్ర వార్తలు చదువుతున్నది గలీజ్ గంగన్న. ఈనాటి ముఖ్యాంశాలు చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం చిక్కదు దొరకదు. ఇందులో చిక్కదుగా చంద్రబాబు నాయుడు, దొరకదుగా వైయస్ రాజశేఖర రెడ్డి నటిస్తున్నట్టు నిర్మాత సోనియా గాంధీ ప్రకటించారు.

జి.మధు, కర్నూలు.

చీటింగ్



రాము: నేను రైల్వే శాఖను చీట్ చేశాను.
వంశీ: ఎలా?
రాము: నేను టికెట్ కొన్నా గానీ ప్రయాణం చెయ్యలేదు.

ప్రపంచాన్నే కొంటా

(ఇద్దరు పిచ్చివాళ్లు మాట్లాడుకుంటున్నారు)

మొదటివాడు: నేను ఈ ప్రపంచాన్నే కొనగలను.
రెండవవాడు: నేను అమ్మినప్పుడు కదా.

ఎస్కె.గౌస్, ఎస్కె.సిరాజ్, ఎస్కె.రియాజ్, ఎస్కె.సమీర్, సంతపేట, నెల్లూరు.

మంచి పేరు

కస్టమర్: నిన్న ఫుల్ మీల్స్‌కి రెండు ప్లేట్లు పెట్టారుకదా. ఇవాళేంటి ... ఒక ప్లేటే పెట్టారు?
సర్వర్: నిన్న ఎక్కడ కూర్చున్నారు?
కస్టమర్: ఆ కిటికీ పక్కన
సర్వర్: అలా చెప్పండి సార్. మా హోటల్‌కి మంచిపేరు రావాలని కిటికీ దగ్గర కూర్చున్న వాళ్లకు తిన్నంత పెడతాం.

కె. పద్మ, అద్దంకి.

ఖాళీ

సంతోష్: అబ్బ...నిన్న విపరీతమైన తలనొప్పితో చచ్చిపోయాననుకో.
సుభాష్: అవునా! నానమ్మ ఎప్పుడూ అంటుండేది. కడుపు ఖాళీగా వుంటే కడుపునొప్పి వస్తుందని. నీ తల నొప్పికి కూడా అదే కారణమేమో.

పి.లక్ష్మి, పొన్నూరు.

చిలుక ఎలా వుంది?

మాధవ్: నేను నీకు గిఫ్ట్‌గా ఇచ్చిన చిలుక ఎలా వుంది?
వెంకట్: వావ్! చాలా టేస్టీగా వుంది.
మాధవ్: అంటే...దాన్ని వండుకొని తినేశావా? అది బోలెడన్ని భాషల్లో మాట్లాడుతుంది తెలుసా!
వెంకట్: మరి నేను దాని మెడ కోసేటప్పుడు ఒక్క భాషలోనూ మాట్లాడలేదే?

కె. వీరేంద్ర, ఒమ్మెవరం, ప్రకాశం.



బాలనేస్తం



ఏం కనిపెట్టారు?

హాయ్ పిడుగులూ... ఇక్కడ కొన్ని పుస్తకాలను కుప్పలాగా పడేశారు. అయితే మీకు ఇక్కడ ఏదో ఒక ఆకారం కనిపించి వుండాలే. కనిపించిందా? మరైతే ఏంటో చెప్పకోండి చూద్దాం!

(ఆన్సర్: ఒక పెద్దాయన ఆకారం. పుస్తకాలనే అలా అమర్చారు. కాకపోతే ఒక కంటి స్థానంలో బూతద్దం పెట్టారు. అవునా!)

చుక్కల్లో చిక్కినదెవరు?



కథా నిలయం శ్రీకాకుళం

జవాబు: గుర్రం

ఒకటిని రెండు చెయ్యగలరా?



నేస్తాలూ... ఇక్కడ అగ్గిపుల్లలతో చేసిన త్రిభుజం ఒకటి వుందికదా. దాన్ని రెండు త్రిభుజాలుగా (పెద్దవి) చేయాలి. ఇంకా ఆరు చిన్న త్రిభుజాలు కనిపించేలా చేయాలి. మరి ప్రయత్నించండి. ఎంతకీ తెలీకపోతే మా సమాధానం చూడండే.





కనిపించాయా

హాయ్! ఇక్కడ ఒక పెద్ద చెట్టు...దాని మీద ఎగురుతున్న కొన్ని పక్షులు కనిపిస్తున్నాయా! అయితే అక్కడే రెండు జంతువులున్నాయి. మరి అవేంటో చెప్పకోండి.

(ఆన్సర్: చింపాంజీ, పులి)

ఆరు తేడాలు ఏవోచ్



నేస్తాలూ... ఇక్కడ మీరు చూస్తున్న రెండు బొమ్మలూ ఒకేలా కనిపిస్తాయి. అయితే ఆరు తేడాలున్నాయి. మీరు వాటిని సరిగ్గా నిముషంలో గుర్తించాలి. మరి ఆలస్యం ఎందుకంట. మొదలెట్టండీ.

సమాధానం: 1. కోతి తల దగ్గర కొమ్మ 2.కోతి కుడి చేతి మీద తాడు 3. కోతి ఎడమ చేతి వేళ్లు 4. మొసలి ముక్కు 5.పక్షి తోక ఈకలు 6. సూర్యుడు సైజు.



బయటపడేదెలా?

టోపీ పైనుంచి బయలుదేరి గజిబిజి దారుల్లోంచి బయటకు వచ్చేదెలాగో కనిపెట్టండి చూద్దాం.

సిహెచ్. అజయ్‌కుమార్, 9వ తరగతి, మధు విద్యాలయం, వైరా, ఖమ్మం.

ఐ. దుర్యోధన్, 5వ తరగతి, ఎం.పి.పి. స్కూల్, గోకర్ణపురం, కంచిలి, శ్రీకాకుళం.



ఎ.సూర్య, 8వ తరగతి, ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్. స్కూల్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

ఎల్. అశోక్, 7వ తరగతి, అజ్జకొల్లు.



> కళ్లు... ప్రపంచానికి వాకిళ్లు. వాటి ద్వారానే...ప్రకృతిలో వున్న ఎన్నో అద్భుతాలను...అందాలను తనివితీరా చూస్తాం. ఆస్వాదిస్తాం. ముగ్ధులమౌతాం. తన్మయత్వానికి లోనవుతాం. అలాంటి అపురూపమైన కళ్లు ప్రకృతి సహజంగా మనకు లభించిన వరం. వాటిని కాపాడుకోవాల్సింది మాత్రం మనమే.

డా॥ కాకర్లమూడి విజయ్

కళ్లు... ప్రపంచానికి వాకిళ్లు...



కంటి చూపు సర్వేంద్రియాలలోకెల్లా అత్యంత ముఖ్యమైనదని ఆర్యోక్తి. బహుశా మరే ఇతర జ్ఞానం లేకపోయినా ఏదో రకంగా నెట్టుకురావచ్చేమో గానీ కంటి చూపు లేకపోవడం అనూహ్యమైన లోటనే చెప్పవచ్చు. ఇంత ముఖ్యమైన అంశాన్ని కూడా మనం చాలాసార్లు అస్సలు పట్టించుకోము. ఆ మాటకొస్తే శరీరంలో ఏ ప్రక్రియ గురించీ, చర్మం, తల వెంట్రుకలు మినహాయించి మరే అవయవం గురించీ అంతగా పట్టించుకోము. కంట్లో నలక పడినా, కంటిచూపు మసకబారినా ఇంతేలే అన్నట్టుంటాము. కానీ శరీరంలో అద్భుతమైన అవయవాల్లో ఒకటైన కన్ను. దాని చూపు గురించి సరైన అవగాహన మనలో చాలా మందికి కరువైంది. సరే! సరిగా పని చేసే దానిపై సమావేశమెందుకు? నిజమే. సరిగా పని చేసే వరకూ అన్నీ బాగానే ఉంటాయి. ఎప్పుడో ఇబ్బంది మొదలౌతుంది. మనల్ని అతలాకుతలం చేస్తుంది.

కెమేరాలా పని చేసే కన్ను

ఒక చిన్న నీరు నిండిన గుడ్డు. దానికొకవైపున సన్నని రంధ్రం. మరొక వైపున తెర. ఈ గుడ్డు పుర్రెలోని గిన్నె వంటి ఖాళీలో ఉంటుంది. ఈ గుడ్డుకు పైనా, కింద రెండు రెప్పలు, ఆ రెప్పలకి వెంట్రుకలు. గుడ్డులో రంధ్రం ఉన్న ప్రాంతం ముదురు గోధుమ రంగులోనైనా, నలుపుగానో, నీలంగానో, పచ్చగానో, లేత గోధుమ రంగులోనో ఉంటుంది. దీన్ని బట్టే కంటి రంగు చెబుతారు. ఇంతకీ కనుగుడ్డు ఏం చేస్తుంది? చిన్న తనంలో చదువుకున్న పుస్తకాలలో కన్ను కెమేరా లాగా పని చేస్తుందని ఉంది. ఇప్పుడు అది కెమేరా కంటే మిన్న అని అర్థమైంది.

ఎన్నో ప్రత్యేకతలు!

ఓ అరడజను కండరాల సాయంతో కనుగుడ్డు ఎటుబడితే అటు కదులుతుంది. పైగా గుడ్డు దగ్గరికి కుంచించనూగలదు. పొడవుగా సాగనూ కలదు. ఈ ప్రత్యేక లక్షణమే మనం 'చూసే' వస్తువు దగ్గరున్నా, దూరంగావున్నా స్పష్టంగా చూడగలిగే వీలు కల్పిస్తుంది.

మానవ నేత్రం కేవలం 25 మిమీ వ్యాసంతో ఉంటుంది. అయినా దూరమెంతో కొలవలేని స్థలాన ఉన్న నక్షత్రాన్నీ చూడగలదు. ఒక ఇసుక రేణువునీ చూడగలదు. ఇంత వ్యత్యాసమున్న దూరాలను క్షణం కంటే తక్కువ కాలంలోనే 'ఎడ్జెస్ట్' చేసుకొని చూడగల శక్తి కంటిది. అలాగే మన తల తిప్పుతున్నా ప్రతి వసువునీ 'గురి' చూసి చూడగలదు.

నిజానికి కన్ను చూడదు!

వాస్తవానికి కన్ను 'చూడదు'! అది కేవలం వస్తువుల పైనుండి వస్తున్న కాంతినే చూస్తుంది. కాస్త ఎక్కువ వెలుగులోనూ, కాస్త తక్కువ వెలుగులోనూ కన్ను చూడగలదు గానీ అసలు చీకట్లో (అంటే ఏ వస్తువూ కాంతిని కాస్త కూడా పరావర్తనం చేయనంతటి చీకటి) ఏమీ చూడలేదు. కాంతి కంటిలోకి పారదర్శక కణజా లాల గుండా ప్రసరిస్తుంది. నాడీ వ్యవస్థ వల్ల ఈ కాంతి కిరణాలు విద్యుత్ సంకేతాలుగా మార్చబడి, మెదడుకు చేరతాయి. మెదడు ఆ సంకేతాలను దృశ్యాలుగా తర్జుమా చేస్తుంది.

కంటి ఆరోగ్యం మన చేతుల్లోనే

కంటి చూపు దెబ్బతినడానికి కేవలం కనుగుడ్డే కాదు. దృశ్యనాడులు చాలా ముఖ్య కారణమౌతుంటాయి. అంధత్వం సాధారణంగా నాడీ సంబంధ సమస్యే. కానీ కంటి చూపును చురుగ్గా, సమర్థవంతంగా, పూర్తి స్థాయిలో ఉంచుకోవడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. మన కంటిని రెప్ప కాపలా కాస్తుంటే మనం మాత్రం అంత జాగ్రత్తగా తీసుకోము.

కంటికి అద్భుతమైన మెయింటెనెన్స్ వ్యవస్థ ప్రకృతి సిద్ధంగానే ఉంది. కంటి రెప్పలు, వాటి అంచుల వెంబడి ఉంటే వెంట్రుకలు దుమ్ముధూళి కంట్లో పడకుండా కాపాడతాయి. తరచూ కళ్లు ఆర్పడం వలన (మన ప్రమేయం

20/20 అంటే..

ఇదేదో క్రికెట్ పోటీ పేరూ కాదు, రాజకీయ వాగ్దానమూ కాదు. 20/20 విజన్ సాధారణ చూపు స్పష్టతను వివరించే పదం. మనకు 20/20 విజన్ ఉన్నదంటే దానర్థం 20 అడుగుల దూరం నుండి సాధారణ కన్నులాగా వస్తువులను స్పష్టంగా చూడగలగడం. ఒకవేళ 20/100 ఉందంటే సాధారణ చూపు గల వ్యక్తి 100 అడుగుల దూరం నుండి స్పష్టంగా చూడగల వస్తువుని మనం 20 అడుగుల దూరం నుండి చూడగలగడం. అయితే 20/20 శ్రేష్ఠమైన చూపు కాకపోవచ్చు. ఇంకా అనేక అంశాలు చూపు నాణ్యతను నిర్ధారిస్తాయి. 15/15 విజన్ 20/20 కంటే తక్కువ కాదు. అది 15 అడుగుల దూరంలో వస్తువుని స్పష్టంగా (సాధారణ దృష్టి కలవారు 15 అడుగుల దూరంలో చూసేదాన్ని) చూడగలగడం.

20/20 బదులు మరే సంఖ్యనైనా వాడవచ్చు. అమెరికాలో మాత్రం 20/20 వాడతారు. బ్రిటన్‌లో అయితే 6/6 మీటర్లు వాడతారు.





లేకుండా) కంటిపై పొర తేమగా ఉంటుంది. అది పొడిబారితే దురద. మాట కలుగుతాయి. కంటిపైన, బయట వైపు లాక్రియల్ గ్రంథులనే కన్నీటి గ్రంథులుంటాయి. ఇవి కన్ను మూసుకున్నప్పుడు కన్నీటితో కనుగుడ్డుని కడుగుతాయి.

కంటి రెప్పల లోపల కన్‌జన్‌క్టివా ఉంటుంది. దానిలో రక్త నాళాలుంటాయి. ఆ పొర మనకు కనిపించే కనుగుడ్డు తాలూకు తెల్లని భాగంపై కూడా వ్యాపించి ఉంటుంది. అందుకే కొన్నిసార్లు, కొంత మందిలో సన్నని రక్తనాళాలు కూడా కనిపిస్తుంటాయి. కంటి పాప (ముదురు గోధుమ రంగు భాగం)పైన కన్‌జన్‌క్టివా ఉండదు. అక్కడ జీవంలేని కార్నియా ఉంటుంది. కార్నియాకి రక్తనాళాలు ఉండవు! దీని ద్వారా కాంతి స్పష్టంగా కంటి లోపలికి వెళుతుంది.

అద్భుతం

కాంతి చిన్న లెన్సు ద్వారా వెళ్ళి రెటీనాపై పడుతుంది. రెటీనా మూడు చదరపు సెంటీమీటర్ల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్నా 137 మిలియన్ల కాంతి గ్రాహక కణాలుంటాయి! వాటిలో 130 మిలియన్లు కడ్డీలలాగా ఉండే రాడ్లు. ఇవి తెలుపు-నలుపు కాంతిని గ్రహిస్తాయి. మిగతా ఏడు మిలియన్లూ శంఖుల్లాగా ఉండే కోన్‌లు. ఇవి రంగులను గ్రహిస్తాయి. కంటి ముందు నుండి ఒక ఈగ ఎగురుకుంటూ వెళ్లినా, ఆ సమాచారాన్ని గంటకు 450 కిమీ వేగంతో దృష్టి నాడి మెదడుకు చేరవేస్తుంది. ఆ సమాచారాన్ని గ్రహించి, అది ఈగ అని తెలిసిపోయేసరికి పట్టే సమయం - 0.02 సెకన్!!.

ఇంత అద్భుతాన్ని మనం ఎప్పుడన్నా పట్టించుకున్నామా? ఎందుకు పట్టించుకోలేదు? కాటుక పెడ్తాం. ఐ లాషెస్‌కి రంగులద్దుతాం. అంతే కంటికి కొత్త అందాలు అమరుతాయి. కానీ చూపు విషయం? తెలియదు. ఈ తెలియని తనానికి కారణాలున్నాయి. అసలు మనకు ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా ఉండే కళ్లే ఆ కారణాలు. అవే గనక చీటికీ మాటికీ చీకాకు పెడితే అప్పుడు తెలిసేది వాటి ప్రాముఖ్యత. అయినప్పటికీ కళ్లు ఇబ్బంది పడుతూనే ఉన్నాయి.

మంచి అలవాట్లు కంటికి రక్ష

మనం తినే ఆహారం దగ్గరి నుండి, మనం చేసే పనుల వరకు కళ్లకు ఇబ్బంది కలిగించేవే. అందమైన కళ్లే కాదు. స్పష్టమైన చూపు ముఖ్యం. విటమిన్ ఎ చూపుకి చాలా మేలు చేస్తుంది. అది లోపిస్తే కళ్లు పొడిగా మారడమే కాక 'రేచీకటి' వస్తుంది. రేచీకటి ఉన్న వాళ్ళు మసక వెలుతురులో స్పష్టంగా చూడలేరు. ఇదికాక ఇంకా చాలా రకాల వ్యాధులు, ఇతర ఇబ్బందులు ఉన్నాయి. ఈ సమస్యల నుండి తప్పించుకోవడానికి మనకు కొన్ని మంచి అలవాట్లు ఉండటం అవసరం.

పౌష్టికాహారం తప్పనిసరి

ఆరోగ్యకరమైన, పౌష్టికా [illegible] తీసుకోవడం వల్ల కంటి



ఐ- బ్యాంకు

రక్తం లాగే కళ్లు కూడా దానం చేయవచ్చు. మృతుల కళ్లు తీసి అవసరమున్న వాళ్లకు అందుబాటులో ఉంచేలా దాచేవి ఐ-బ్యాంకులు. నేత్ర దానం చేసేవాళ్లు తమ నేత్రాలను ఇటువంటి బ్యాంకులకు అందించవచ్చు. మొట్టమొదటి ఐ-బ్యాంకు అమెరికాలో 1944లో ప్రారంభమైంది. చనిపోయిన 3 గంటలలోపే కళ్లని శరీరం నుండి వేరు చేసి భద్రపరచాల్సి ఉంటుంది. లేకపోతే ఆ కళ్లు ఇతరులకు ఉపయోగపడవు. నీరు ఘనీభవించే ఉష్ణోగ్రతకంటే కాస్త ఎక్కువ ఉష్ణోగ్రతలో కళ్లు ఉంచుతారు. వాటిని వెంటనే కార్నియా సమస్య ఉన్నవాళ్లకు అమరుస్తారు.

కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్‌లో మొత్తం కన్నుని ఉపయోగించరు. కంటిపాప పైన ఉండే కార్నియాని మాత్రమే కోసి, కొత్త (దాత) కార్నియాని కుట్టేస్తారు. కొన్ని నెలల తరువాత కొత్త కార్నియా మిగతా కంటితో ఏకమౌతుంది. మన దేశంలో కార్నియా సమస్యల వల్ల అంధత్వం సాధారణం. కాబట్టి నేత్రదానం అవసరం.

సమస్యలే కాదు. అనేక శారీరక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. తాజా పండ్లు, కూరగాయలు తీసుకుంటే విటమిన్లు, యాంటీ ఆక్సి డెంట్లు పుష్కలంగా లభించి వయసుతోపాటు వచ్చే కంటి సమస్యలను దరి చేరనీయవు. అలాగే చేపలు కూడా కంటి చూపుకి మంచి చేవనిస్తాయి.

కంటి జబ్బులు

క్రమబద్ధమైన శారీరక వ్యాయామం కూడా కంటి సమస్యలను దూరం చేస్తుందని నిరూపించబడింది. రోజంతా కంప్యూటర్ స్క్రీన్‌కి రెండడుగుల దూరంలో కూర్చొని, దానికి కళ్లప్పగించేస్తే బోలెడు సమస్యలు- కంటికీ, ఒంటికీ! కనీసం కంటికైనా వ్యాయామం అవ సరం. మద్యం, సిగరెట్లు కూడా 'కాటరాక్ట్‌'కి కారణమవ్వచ్చు. గ్లకోమా, స్క్లెరైటిస్, కిరాటో కోనస్ (కార్నియా రూప భ్రంశం), డయాబెటిక్ రెటీనోపతీ (డయాబెటిస్ వల్ల అంధత్వం) వంటి సమస్యలు అనేకం ఉన్నాయి. ఇవికాక కండ్లకలక (కన్‌జన్‌క్టివైటిస్), స్టై (కంటి రెప్పలపై మొటిమ వంటిది), షలాజియాన్ (కనురెప్పల లోపల పుండు) వంటివి ఇంకెన్నో.

ఇక వయసుతో పాటు వచ్చే దూరదృష్టి, హ్రస్వదృష్టి (వయసుతో సంబంధం లేకుండా కూడా రావచ్చు. వంశ పారంపర్యం గానూ రావచ్చు) వంటివి మామూలే.

చేతులారా చేసుకునేవి

ఈ నాటికీ అమలులో ఉన్న మూఢ/మత విశ్వాసాలూ కంటికి హాని కలిగిస్తు న్నాయి. 'పొంగు' వ్యాధి వచ్చినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని మందులు వాడకుండా వేపాకుల వైద్యం చేస్తూ గడిపి, కంటి చూపు కోల్పోయిన వారున్నారు. అలాగే మూలికా వైద్యం పేరుతో రకరకాల ద్రవాలు, పసరులు కంట్లో పోసి అపాయం తెచ్చుకున్నవాళ్లూ ఉన్నారు. హోలీ వంటి పండగల్లో కంట్లో ప్రమాదకరమైన రంగు లు పడినా, దీపావళి వంటి పండుగల్లో జరిగే ప్రమాదాలూ కంటి చూపుకు అత్యంత హానికరంగా ఉన్నాయి.

కొన్ని రకాల ఆటలు కూడా కళ్లకు భౌతికంగా అపాయం కలిగించవచ్చు. అలాగే కొన్ని రకాల వృత్తులు (వెల్డింగ్, డ్రిల్లింగ్) కూడా కంటి చూపును దెబ్బతీయవచ్చు. ఇటీవలే వచ్చిన కొత్త రకం వృత్తులు సాఫ్ట్‌వేర్, కాల్ సెంటర్లు ఇత్యాది - చాపకింద నీరులా మొత్తం శరీరానికీ, ప్రత్యేకించి కంటికీ చాలా హాని కలిగిస్తున్నాయని తేలింది.

కంటిని కాపాడుకుందాం

మనకు మంచి చూపు గొప్ప ఆస్తి. దాని విలువ అది సరిగా లేనివాళ్లకే తెలుస్తుంది. ఇప్పుడు మనం చూడగలిగేవన్నీ చూడలేని జీవితం ఊహించండి. కంటి ప్రాధాన్యత అప్పుడు తెలుస్తుంది. అటువంటి అమూల్యమైన చూపును యధాశక్తి కాపాడు కోవడం, వీలు చేసుకొని మెరుగుపరుచుకోవడం మనం తప్పక చేయవలసినవే.

ఆరోగ్యకరమైన ఆహారం, ప్రాథమిక కంటి సంరక్షణ, అప్పుడప్పుడు కంటికి వైద్య పరీక్షలు, ఏ మాత్రం కంటికి ఇబ్బంది, కలిగినా వెంటనే వైద్య సలహా పొం దడం, చిన్న పిల్లలకు దృష్టి పట్ల జాగ్రత్తలు నేర్పడం వంటి చర్యలు మనం జీవించి ఉన్నంత వరకూ మంచి చూపు ఉండేలా సహాయపడతాయి. అటు వంటి ఆరోగ్య కరమైన నేత్రాలు మన తదనం తరం కూడా జీవించడానికీ, మరో అభాగ్యునికి దృష్టి ప్రసాదించడానికీ నేత్ర దానం చేయడం మంచిది. ❄

మజ్జిగ పులుసు

కావలసిన పదార్థాలు

చిక్కని పుల్ల మజ్జిగ- 1/4 సేరు, సెనగపిండి గాని బియ్యం పిండి గాని - ఒక గరిటెడు, పచ్చిమిర్చి-4, పసుపు - చిటికెడు
ఉప్పు - సరిపడ , పోపు సామాను- కరివేపాకు

తయారు చేసే విధానం

మజ్జిగలో పిండి ఉండలు కాకుండా కలిపి స్టౌమీద పెట్టాలి. పచ్చిమిర్చి చీలికలు చేసి వేయండి. ఇవి బాగా కాగిన తరువాత కిందకు దించి ఉల్లి ముక్కలు, ఉప్పు వేసి కలియ దిప్పి మూత పెట్టండి. గరిటలో నూనె వేసి పోపుపెట్టాలి. దానిని మజ్జిగలోనే వేయాలి. ఆ వెంటనే దీనిలో పోసి తాలింపు పెట్టి పసుపు కూడా వేసి మూత పెట్టండి. ఉల్లిపాయ కాస్త మగ్గి పచ్చిగా కాకుండా, ఉడికినట్లు కాకుండా ఉంటే బాగుంటుంది.



నిమ్మకాయ పచ్చడి

కావలసిన పదార్థాలు

నిమ్మకాయలు-25, పసుపు- 1 టేబుల్ స్పూను, మెంతులు- 100 గ్రాములు,ఉప్పు - 1/4 కిలో, కారం - సరిపడా

తయారు చేసే విధానం

నిమ్మకాయలు శుభ్రం చేసి నాలుగు ముక్కలుగా కోసి ఉప్పు, పసుపు వేసి కలియ బెట్టాలి. మూడవ రోజున వీటిని గట్టిగా పిసకాలి. మెంతులు వేయించి మెత్తగా పొడుం కొట్టి దీనిలో కలపాలి. తరువాత కారం పోసి కలిపేటప్పుడు గరిట జారుగా అయితే సరిపోయినట్లు. ఇందులో కావాలంటే పచ్చిమిరపకాయలు సూదితో బెజ్జాలు పెట్టి వేసుకోవచ్చు. ఇంకా కాకరకాయ ముక్కలు, తోటకూర ముక్కలు కూడా వేసుకోవచ్చు. ఇవి ఊరి చాలా బాగుంటాయి.



మరమరాల ఉప్మా

కావలసిన పదార్థాలు

మరమరాలు- 1 శేరు, పచ్చిమిర్చి- 5, అల్లం- 1అంగుళం (తగినంత), పచ్చి శెనగపప్పు- గరిట, ఆవాలు- 1/2 గరిట, ఉప్పు - సరిపడా, నూనె - 100 గ్రా, మినపపప్పు-1/2 గరిట, కరివేపాకు- 4 రెబ్బలు

తయారు చేసే విధానం

మరమరాలు నీళ్ళలో వేసి కలిపి గట్టిగా పిండి గిన్నెలో వేసుకోవాలి. అల్లం, మిర్చి చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి.

బాండీలో నూనె వేసి కాగిన తరువాత శనగ పప్పు, మినపపప్పు, ఆవాలు, కరివేపాకు వేసి మిర్చి, అల్లం ముక్కలు కూడా వేసి ఒక్క క్షణం వేగనిచ్చి కాసిని నీళ్ళు పోసి ఉప్పు వేయండి. ఇవి తెర్లేటప్పుడు నాన బెట్టిన మరమరాలు వేసి కలియ తిప్పుకోవాలి. రవ్వంత పసుపు కూడా వేసుకుంటే బాగుంటుంది. ఇలాగే అటుకులతో కూడా ఉప్మా వేసుకోవచ్చు. కాకపోతే దీనికి కొంచెం నీళ్లెక్కువ పడతాయి.

బంగాళాదుంప చిప్స్

కావలసిన పదార్థాలు

బంగాళాదుంపలు, కొంచెం పసుపు, సరిపడా ఉప్పు

తయారు చేసే విధానం

బంగాళాదుంపలు చిప్స్ కోసుకునే పీటతో అయితే బాగా పల్చగా ఆకులమల్లే వస్తాయి. లేకపోతే కత్తితో గాని కత్తిపీటతో గాని సన్నగా కోసుకోవచ్చు. బంగాళాదుంపలు శుభ్రంగా కడిగి పొట్టు తీయకుండానే కోసుకోవచ్చు. దుంపలు కొంచెం మెత్తబడినా పరవాలేదు. స్టౌమీద గిన్నె పెట్టి కాసిని నీళ్లు, ఉప్పు వేసి మరగనివ్వాలి. ఇవి మరిగిన తరువాత పసుపు, తరిగి పెట్టిన బంగాళాంప ముక్కలు వేసి ఒక పొంగు వచ్చేవరకు ఉంచాలి. తర్వాత చిల్లుల గిన్నెలో వేసి నీళ్లన్నీ పోయిన తరువాత గుడ్డపై వేసి యెండ పెట్టాలి. ముక్కలు అతుక్కోకుండా విడివిడిగా తీసుకోవాలి. ఇవి బాగా యెండిన తరువాత డబ్బాలో పోసుకొని మనకు కావలసినప్పుడు కాసిని తీసుకొని బాండీలో వేయించుకోవాలి. బయటికి తీశాక వీటిమీద కారం, ఒక్క పిసరు ఉప్పు చల్లుకు తింటే బాగుంటుంది. టీకి, టిఫిన్‌కు కూడా పనికివస్తాయి.

కథ



శైలి

> ఆనాడు అన్నీ సవ్యంగా సాగినా ఓ అపశృతి దొర్లింది. సహపంక్తిలో అన్యకులస్తురాలైన సుమతి కూర్చోవడానికి వీల్లేదని కొందరు పెద్దలు కరాఖండిగా శాసించి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. పెదనాన్నా పెద్దల్ని వారించలేక పోయాడు. మిత్రులు తేలిగ్గా తీసుకోమని చెప్పారు తప్ప తనను, సుమతిని అర్థం చేసుకోలేకపోయారు. అభిమానం దెబ్బతిన్నది. తమ వివాహం ఊరంతా ఆమోదించలేదనడానికి ఇది నిదర్శనమైంది. ఒక క్షణం కూడా ఆలస్యం చేయక తక్షణం బట్టలు సర్దుకొని ఇంటి నుండి ఊరినుండి నిష్క్రమించారు. నిర్ఘాంతపోవడం పెద్దల వంతైంది.

అమ్మవారి సంబరం

పదిహేనేళ్ళ తర్వాత యోగేందర్ స్వగ్రామం బయలుదేరాడు. సకుటుంబ సమేతంగా భార్య సుమతి, కొడుకు కూతురుతో కలిసి. సోషియాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్న అతనికి నలభై ఏళ్ళు. చిన్నప్పటి నుండే శ్రమైక జీవన సౌందర్యంపై మక్కువ ఎక్కువ. నిజాయితీగా కష్టపడేవాళ్లను తనివితీరా చూడటం, వారితో కలగజేసుకొని మాట్లాడటం. ఆ మాటల్లోని మంచిని గ్రహించి మదినిండా నింపుకోవడం అతనికో గొప్ప సరదా.

ఈ స్వీయానుభవాన్ని ఎప్పటికప్పుడు కలబోసి కాలేజీ పిల్లలకు విశ్లేషణాత్మకంగా వివరిస్తూ వారిని కూడా తనదైన ప్రపంచంలోకి లాక్కుపోతుంటాడు. ఆ విధంగా సామాజిక మానవ సంబంధాలను చాలా ఆకర్షణీయంగా విద్యార్థులకు బోధిస్తుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే కష్టజీవుల పట్ల ఆరాధనపూర్వకంగా...

యోగేందర్‌ది చేనేత గ్రామం. వృత్తి చేనేత వృత్తి. వృత్తిలోని పడుపేకల అల్లికే చెప్పే పాఠాల్లోకి వచ్చేస్తుంది. పాఠాలెప్పుడూ రుజువర్తనం వైపే నడుస్తుంటాయి. కారణం వృత్తి స్వభావంలోని అంతర్భాగమే ఈ నడక.

చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో పెదనాన్న వీరభద్రం ఆలనాపాలనలోనే యోగేందర్ పెరిగాడు. ఎం.ఎ. చదువుతుండగానే ప్రగతిశీల భావాలవైపుకు మరలాడు. నిరాడంబరంగా వర్ణాంతర వివాహాన్ని చేసుకున్నాడు. వీరి ప్రేమ వివాహాన్ని సహజంగానే పెద్దలు అంగీకరించలేదు. అయినా ధైర్యం చేసి పెళ్ళి చేసుకున్నారు. మిత్రులు ప్రోత్సహించారు.

వచ్చే జీతపురాళ్ళతోనే పొదుపుగా సంసారం సాగించడం, వేరే సంపాదనపై ధ్యాస లేకపోవడం. పిల్లలను క్రమశిక్షణతో పెంచుకోవడం ఇలాంటి గుణాల వల్ల వారి కుటుంబ జీవనం చల్లటి సెలయేరులా సాఫీగా సాగిపోతున్నది.

యోగేందర్ ఎప్పుడూ తనకంటే కింది కష్ట జీవుల జీవితాలతో పోల్చుకుంటూ.... ఆహా వారి కంటే నిజంగా తానెంతో అదృష్టవంతుణ్ణి కదా! తనకు అన్నీ సమకురాయి కదా! చక్కని ఇల్లాలు, పిల్లలు ఇంతకంటే ఏం కావాలి? అని పదే పదే అనుకుంటూ సంతృప్తి పడి పోతుంటాడు. స్వంత ఇల్లు, ఆస్తి వాహనం, ఆధునిక సౌకర్యాలకోసం మధ్యతరగతి వర్గం ప్రపంచీకరణవైపు పరుగుపెడుతున్న ప్రస్తుత తరుణంలో యోగేందర్ జీవనశైలి చాలా మందికి ఏకత్వంలో భిన్నత్వంగా తోచేది. చాదస్తుడని, అసమర్థుడని, అల్పసంతోషని చాటుమాటుగా అనుకున్నా పట్టించుకోకుండా తన దారిలో తాను పోతుంటాడు.

అయితే పదిహేనేళ్ళ క్రితం ఊరు విడిచి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందంటే అదో చిన్న కథ.

❖ ❖ ❖

ఊరిలో అమ్మవారి సంబరాలు జరుగుతున్నాయి. అమ్మవారంటే వారి కుల ఇలవేల్పు శాంభవీ దేవి జ్యోతిర్మయోత్సవాలు. కులానికి సంబంధించిన పెద్దల జనరల్ బాడీ జరుగుతోంది. నిర్ణయానంతరం చందాలు వసూలు చేస్తారు. ఊరిలో ఉన్నత కులం వారేగాకుండా చుట్టు పక్కల గ్రామాల్లోని కుల బంధువులు కూడా ఉత్సవంలో పాల్గొంటారు. సంబరంలో ఊరేగింపులు, సహపంక్తి సంతర్పణలు ఉంటాయి. పందిళ్ళ అలంకరణ, తోరణాలు, మైకులు, మేళతాళాలు, పూజా పునస్కారాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాల కోలాహలంతో ఊరు ఊరంతా వెలిగిపోతుంది.

ఆనాడు అన్నీ సవ్యంగా సాగినా ఓ అపశృతి దొర్లింది. సహపంక్తిలో అన్యకులస్తురాలైన సుమతి కూర్చోవడానికి వీల్లేదని కొందరు పెద్దలు కరాఖండిగా శాసించి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. పెదనాన్నా పెద్దల్ని వారించలేక పోయాడు. మిత్రులు తేలిగ్గా తీసుకోమని చెప్పేవారు తప్ప తనను, సుమతిని అర్థం చేసుకోలేకపోయారు. అభిమానం దెబ్బతిన్నది. తమ వివాహం ఊరంతా ఆమోదించలేదనడానికి ఇది నిదర్శనమైంది. ఒక క్షణం కూడా ఆలస్యం చేయక తక్షణం బట్టలు సర్దుకొని ఇంటి నుండి ఊరినుండి నిష్క్రమించారు. నిర్ఘాంతపోవడం పెద్దల వంతైంది.

అప్పటి నుండి ఇప్పటి వరకు ఊరి ముఖం చూడలేదు. ఉద్యోగ రీత్యా చాలా ఊళ్లు తిరిగినా స్వంత ఊరికి మాత్రం వెళ్ళలేదు. వ్యక్తిగా తనకు ప్రత్యేక గౌరవం గుర్తింపు వద్దు. ఇస్తే...

వస్తే తన మొత్తం కుటుంబానికే ఆ గౌరవం దక్కాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు సకుటుంబ సమేతంగా ఉత్సవంలో సంతర్పణలో పాల్గొనమని పెద్దల నుండి ఆహ్వానమందింది. అదీగాక అమ్మవారి ఉత్సవపూజ చేసేది వారి పెదనాన్నే గావడం మరో విశేషం. అయితే పూజా నిర్వహణలో సగం బాధ్యతలు యోగేందర్ కుటుంబం నిర్వహించాల్సి ఉంటుంది.

సాదరమైన ఆహ్వానంతో ఇప్పుడు సాధికారికంగా స్వగ్రామానికి బయలుదేరడంతో యోగేందర్ హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతున్నది. ఊళ్లోకి ప్రవేశిస్తున్న కొద్దీ కొత్తలోకంలోకి అడుగిడుతున్న అనుభూతి



కలుగుతున్నది. సుమతి హృదయంలో కూడా అదే స్పందన. పిల్లలైతే ఇక సరే సరి. పెదతాతమ్మను, నానమ్మను ఎప్పుడెప్పుడు చూద్దామా అని వారి మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది.

దారిపొడవునా తోరణాలు, రంగు రంగుల విద్యుద్దీపాలు. మైక్‌లో శ్రావ్యంగా విన్పించే భక్తిరస ప్రధానగీతాలు, పందిళ్ళు, ద్వారాలు ఫ్లెక్స్‌బోర్డులు, సెట్టింగ్‌లు, షామియానాలు, అలంకరణలతో మయసభను తలపిస్తున్నాయి.

ఉత్సవపనుల్లో ఎక్కడికక్కడ జట్లు జట్లుగా శ్రమిస్తున్నారు యువకులు. రంగవల్లులు, కళ్లాపి, ముగ్గులతో లోగిళ్ళు వాకిళ్ళే కాదు. వీధులన్నీ ముస్తాబైపోయాయి. పసుపుపచ్చ పువ్వులు, ఆకుల్లో మహిళలు కలిసిపోయారు. అందరి వదనాలు ఆనందంతో తుళ్ళి తుళ్ళి పడ్తున్నాయి. ఆప్యాయంగా పలకరించే వాళ్ళు, పిల్లల్ని ముద్దాడేవాళ్ళతో యోగేందర్ కుటుంబం ఉబ్బి తబ్బిబై పోతున్నది. ఇన్నాళ్ళ నిరీక్షణ ఈ మధురానుభూతి కోసమే కదా మరి.

శుభ్రంగా తలారా స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించి, గంధం విభూది రేఖలతో, కుంకుమ బొట్లతో పూజకు ఉపక్రమించారు.

దేవాలయంలో అమ్మవారి అఖండ జ్యోతార్చనతో పూజాక్రతువు ప్రారంభమైంది. సుమతీ, యోగేందరులు కూడా పెద్దల స్థానంలో పీటలపై కూర్చొని పౌరోహితులు చెప్పిన విధంగా పూజ చేశారు. ఒక పక్క నిర్విఘ్నంగా పూజలు సాగుతున్నాయి. మరో పక్క అమ్మవారిని దర్శించేందుకు భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. గతంలో మాదిరి ఇప్పుడు కులం అడ్డుగా లేదు. ఆర్థిక అంతరాలు ఎప్పుడూ లేవు. అన్య వర్ణాల వారు సైతం భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలవడం యోగేందర్‌కు సంతోషాన్నిచ్చింది.

'ఎంతలో ఎంత మార్పు, విచారిస్తే అతనికి అర్థమయింది. ఏంటంటే.

ప్రపంచీకరణ ఐ.టి బూమ్ వచ్చాక పిల్లలు తామర తంపరలాగా ఇంజనీర్‌లై ఎక్కడ బడితే అక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. ఆక్రమంలో వర్ణ, మత, రాష్ట్రేతర వివాహాలు కూడా అతి సామాన్యంగా జరిగిపోతున్నాయి. అందుకే కుల ఇలవేల్పు పూజలు కూడా చాలా సరళమైపోయాయి. భౌతిక మార్పు భావాల అడ్డుగోడలను బద్దలు కొడతాయన్న భావన మరోసారి ధృవపడింది.

ఇక అమ్మవారి జ్యోతి ఊరేగింపు ప్రారంభమైంది. ఊరేగింపులో పాల్గొనేందుకు ఎక్కడెక్కడి జనం నేల ఈనినట్టు వస్తున్నారు. రహదారులు కిక్కిరిసి పోయాయి. పిల్లా పాపలతో జనం పోటెత్తింది. పరిస్థితిని గమనించిన యోగేందర్ మైక్ వద్దకు వెళ్లి త్రొక్కిసలాట ప్రమాదం జరగకుండా హెచ్చరిస్తున్నారు. సిటీకేబుల్ వాళ్ళు ప్రత్యక్ష ప్రసారంకై రంగంలోకి దిగారు. అమ్మవారి జ్యోతిని అందరికీ కన్పించే వీలుగా 16 ఎం.ఎం. తెరలు అమర్చారు. యువత బాణాసంతా పేల్చడంలో కేరింతలు కొడ్తూంది.

పాశుపతాస్త్రం, నాగాభరణం, చంద్రవంక వంటి పెద్ద పెద్ద డిజైన్‌లతో బాణాసంచా పేలి అద్భుతమైన కనువిందు చేస్తున్నాయి. అమ్మవారి సంబరం అంబరాన్ని తాకుతున్నది.

ఈ మొత్తం ఉత్సవంలో కీలకమైన ఘట్టం అమ్మవారి జ్యోతిపై మనస్సును లగ్నం చేసి రక్తం నిష్టతో చేసే అలుగుసేవ. అలుగు అంటే ఆయుధం, బాణం, వెలుగుతున్న జ్యోతులు కలిగిన శూలాలను పెదాలు, బుగ్గలు, చేతులకు గుచ్చుకొని మేళతాళాలకు అనుగుణంగా లయాన్వితమైన వీరంగ నృత్యం చేస్తూ అమ్మవారిని కొలుస్తారు. మరి కొందరు రణరంగ కత్తులు ధరించి పరాక్! బహుపరాక్ అంటూ ఛాతీపై గీసుకుంటూ రక్తార్పణ గావిస్తారు. యుద్ధభూమిలో వీరులు కరవాలాల స్వైరవిహారాన్ని ఆదృశ్యాలు తలపిస్తాయి. పిల్లలు తల్లులు ఈ అలుగు సేవను భక్తి శ్రద్ధలతో వీక్షిస్తూ సేవలో పాల్గొన్నారు. వారిని అమ్మవారి వీరభద్ర సంతతిగా పూజిస్తారు.

తరతరాలుగా సాంప్రదాయంగా చేస్తున్న ఈ పవిత్రమైన అలుగుసేవలో ఎవ్వరూ మద్యం సేవించి పాల్గొనరాదని యువతే నిర్ణయించుకోవడం బహిరంగంగా ప్రకటించడం ... పాటించడం... నిజంగా ఉత్సవానికే గర్వకారణమైంది. గతంలో ఈ అలుగుసేవలో పాల్గొనేవారు వందలోపే ఉండేవారు. కాని ఇప్పుడు వందకాదు. దాదాపు వేయి మంది పాల్గొనడం యోగేందర్‌కు ఆశ్చర్యానికి గురి చేసింది. యువతలో పెల్లుబుకుతున్న వీరావేశం, త్యాగనిరతి, రక్తార్పణ, క్రమశిక్షణ మొత్తం సమాజాభివృద్ధిలో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలనే తలంపు యోగేందర్‌కు కలుగుతున్నది. లేకపోతే అనివార్యంగా వెర్రితలలు వేస్తుందనే భయం కూడా పుడుతున్నది.

మరుసటి రోజు సహపంక్తి సంతర్పణంలో ఊరిజనం అంతా పాల్గొన్నారు. అగ్రవర్ణం-నిమ్నవర్ణం అని లేదు. బీదాధనిక భావం లేదు. అందరూ అమ్మవారి ప్రసాదాన్ని సమిష్టిగా స్వీకరించారు. ఇరవై వేలమందికి ఏకకాలంలో వంటలు వార్పులు వడ్డంపులు చేయడం గొప్పకళ. అదో కన్నుల పండుగ దృశ్యం. వడ్డించడంలోనే కాదు. విస్తళ్ళు తీయడంలో కూడా ఉత్సాహమే. చక్కటి ప్రణాళికతో ఆడంబరం లేకుండా హృద్యంగా సాగిన ఈ సంతర్పణ కార్యక్రమం యోగేందర్‌కు ఎనలేని తృప్తి నిచ్చింది.

సంతర్పణతో ఉత్సవం ముగుస్తోంది. యోగేందర్‌లో విషాదచ్ఛాయలు ముసురుకుంటున్నాయి. పొరుగూర్ల నుండి వచ్చిన వారు ఒక్కొక్కరు తిరుగు ప్రయాణం పట్టారు. ఆప్యాయతానురాగాలతో, స్నేహబాంధవ్యాలతో, పరస్పర మర్యాద మన్ననలతో ఇప్పటి వరకు కురిసిన జడివాన వెలసిపోతున్నది. గ్రామం బోసి పోవడం మళ్ళీ మొదలవుతున్నది. అంతరాల్లేని సహజమైన సామాజిక మనిషి మరలా యాంత్రిక ప్రపంచంలోకి పోతున్నాడు. గమ్యంలేని బాటసారైపోతున్నాడు. మనుషులు మర బొమ్మలైపోతున్నట్టు మసకమసగ్గా కనిపిస్తున్నది.

ఇక ఈ అమ్మవారి సంబరం తనకిక మెరుపులాంటి కలేనా! పిల్లలకు చెప్పుకునే పాతంలాగా మిగిలిపోవాల్సిందేనా? అనేక ప్రశ్నలు యోగేందర్‌ను వేధిస్తున్నాయి. బాధిస్తున్నాయి.

ఏకాంతంలో దిగులుగా కూర్చున్న యోగేందర్‌ను పెదనాన్న వీరభద్రం చూశాడు. యోగేందర్ ఆంతర్యాన్ని గ్రహించాడు. దగ్గరగా కూర్చుని హితవు చెప్పాడు. "బాంధవ్యాలు కలుపుకుంటే కలిసేవి. విడిపోతే వీడేవి. కుటుంబమైనా, ఊరైనా అంతే. అనుభవంతో చెప్తున్నా..... ఉమ్మడి ఆనందంతో జీవించు. ఉమ్మడి ఆనందంకై జీవించు."

వెన్వెంటనే యోగేందర్ పెదనాన్న చేయి పట్టుకుని "ఇక నుండి వీలైనప్పుడల్లా ఊరొచ్చి ఊరుమ్మడి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటా పెదనాన్నా..." అని చల్లని మాట ఇచ్చాడు. బదులుగా పెదనాన్న యోగేందర్‌ను ఆలింగనం చేసుకున్నాడు.

✻

సంతార్పణతో ఉత్సవం ముగుస్తుంది. యోగేందర్‌లో విషాదచ్ఛాయలు ముసురుకుంటున్నాయి. పొరుగూర్ల నుండి వచ్చిన వారు ఒక్కొక్కరు తిరుగు ప్రయాణం పట్టారు. ఆప్యాయతనురాగాలతో, స్నేహబంధవ్యాలతో, పరస్పర మర్యాద మన్ననలతో ఇప్పటి వరకు కురిసిన జడివాన వెలసిపోతున్నది. గ్రామం బోసి పోవడం మళ్ళీ మొదలవుతున్నది. అంతరాల్లేని సహజమైన సామాజిక మనిషి మరల యాంత్రిక ప్రపంచంలోకి పోతున్నాడు. గమ్యంలేని బాటసారైపోతున్నాడు. మనుషులు మర బొమ్మలైపోతున్నట్టు మసకమసగ్గా కనిపిస్తున్నది.

డా॥ జె.పి.వైద్య

ముగ్ధ మనోహరమైన అభినయంతో... కేవలం 'కళ్ల బాసలతో' కదిలించి పోయేలా సినీ ప్రేక్షకుల గుండెల్లో ఎందరో కొందరు వుండొచ్చుకానీ మన తెలుగు వాళ్లకు అదృష్టదేవత ఆశీర్వాదంగా సావిత్రి దొరికారు. ఉత్తరాది వాళ్లకు మీనాకుమారి లభించారు. ఇద్దరి జీవితాలకూ సారూప్యత వుంది. వీరి జీవితాలు తీవ్ర మానసిక ఘర్షణలతో సాగిపోయాయి. తెరమీదా తెర వెనకా ఇద్దరివీ 'కళ్ల బాసలే'! ఇద్దరూ ప్రేమ కోసం పరితపించిన వాళ్లే. ఇద్దరివీ అత్యంత కరుణార్ద్రమైన అంతాలే. మళ్లీ మనకు ఇంతవరకు మరో సావిత్రి దొరకలేదు. మరో మీనాకుమారి లభ్యం కాలేదు. ఇద్దరూ భారత సినీ వినీలాకాశంలో దేదీప్యమానంగా వెలిగిపోయి దుఃఖదేవతల్లా తెరవెనక్కి వెళ్లిపోయినవాళ్లే!

తెర వెనక్కి వెళ్లిన 'పాకీజా' మీనాకుమారి!

మీనాకుమారి గురించి రాయాలంటే పేజీలు సరిపోవు. అంతటి తపన, ఎడబాటు, విషాదం, దుఃఖం, కన్నీళ్ల జీవితం 'మీనా'ది. మీనా అమ్మమ్మ హేమసుందరీదేవి. ఆవిడ నోబెల్ అవార్డ్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ బంధువైన 'రేవ్‌బిల్'ను పెళ్లాడింది. ఆయన ఆకస్మిక మరణం ఆవిడను కష్టాల్లో పడేసింది. ఆర్థిక, రాజకీయ కారణాలకు ఆవిడ బలిఅయిపోయి, పూర్తిగా నిస్సహాయురాలైపోయింది. ఆమె కూతురు ప్రభావతీదేవి. చక్కటి నాట్యకళాకారిణి. ఎంతో పేరు ప్రఖ్యాతులున్న రంగస్థల నటి. కళా ప్రపంచంలో ఆవిడ పేరు 'కామిని'.

కారణాంతరాల వల్ల కామిని కాస్త ముస్లింగా మారి 'ఇక్బాల్ బేగమ్'గా చలామణి అయింది. ఆవిడ భర్త అలీబఖ్ష్, అలనాటి ముంబాయి సినీ దునియాలో చిన్నా చితకా వేషాలేసి బతికేవాడు. ఇల్లంతా అతుకులేసినట్టు పేదరికంతో, ముప్పై అతుకుల్లా మాడిపోయి వుండేది. ఎంతటి భయానకమైన దరిద్రం అంటే మూడవ కూతురుగా పుట్టిన 'మెహజబీన్'ను భరించే తాహతు కూడా లేకపోవడం వల్ల అనాథాశ్రమంలో పారేసి వచ్చాడు అలీభక్ష్. ఆయనకు ముక్కు మీద కోపం. కోపం తగ్గాక కూడా ధూంధాం అంటూ చిందులేసేవాడు...'హు! వెధవది...మూడోసారీ కూతురేనా? అనే కోపం కాస్త దిగమింగి, మనసు మార్చుకొని చిన్నారి బిడ్డను మళ్లీ తిరిగి ఇంటికి తెచ్చుకున్నాడు.

అది మనం చేసుకున్న అదృష్టం కావొచ్చు. లేకపోతే 'మెహజబీన్' వుండేదీ కాదు...మీనాకుమారి కన్పించేదీ కాదు. హిందీ వెండితెర చరిత్ర మీనాకుమారి లేక ఖాళీగా బోసిపోయినట్టు వుండి వుండేదీ కావచ్చు. చురుగ్గా , మొహం నిండా అమాయకపు అందాలు చిందే చిన్నారి 'మెహజబీన్'కు స్వయంగా ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల బలవంతం వల్ల బాలనటిగా మారాల్సి వచ్చింది. తొలి సినిమా 'లెదర్ ఫేస్'. తర్వాత సినీ వినీలాకాశంలో ఆ ఫేస్ ఎందరిని మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిన విషయమే. తొలి రోజుల్లో ఆవిడ నటించిన సినిమాలన్నీ భక్తిరస ప్రాధాన్యత కల్గిన 'వీర ఘటోత్కచ' (1949) , 'శ్రీ గణేష్ మహిమ' (1950) లాంటివి. మరికొన్ని పౌరాణికాలూను. ఆవిడలోని సహజ నటన 'బైజు బావరా' (1952)లో యావత్ భారతదేశపు సినీ రసికులను తట్టి లేపింది.

ఇక మెహజబీన్ ను మీనాకుమారిగా మార్చిన మహానుభావుడు సుప్రసిద్ధ సినీ నిర్మాత, దర్శకుడు, రచయిత కమాల్ అమ్రోహీ. ఆయన అసలు సిసలు పేరు సయ్యద్ అమీర్ హైదర్. అమ్రోహా వాళ్లూరు. బాల్యం నుండీ రంగీలా రతన్‌గా ముద్రపడ్డ రసికుడు. చిన్ననాటి రోజుల్లోనే మాలాగిరీ అనే నాట్యకత్తె నాట్యం, గానం పట్ల మోహితుడై మోజుపడ్డే ఇంట్లోని పెద్దలు సామదాన దండ భేదోపాయాలన్నీ ఉపయోగించి దాదాపు చేతులెత్తేసేంత తిప్పలు పెట్టిన మహనీయుడు. సాహిత్యం, షేర్‌షాయరీ అంటే పడిచచ్చేవాడు. ఆ పిచ్చి ముదిరి పాకాన పడింది. ఆయన చలన చిత్రాల మాయానగరి 'ముంబాయి'కి పలాయనమై వచ్చాడు. కొన్నాళ్లకు అక్కడివాడే అయిపోయాడు. మహల్ చిత్రంలో మొట్టమొదటిసారి అశోక్‌కుమార్‌కు సిగరెట్టు పొగల వలయాల రుచి చూయించిన ఘనత వారిదే. 'జేలర్' చిత్ర నిర్మాణం నాటి రోజులవి. బాలనటి కోసం వెదుకుతున్న రోజులు. 'దాదర్‌లో ఓ అలిబఖ్ష్ వున్నాడు. తల తిక్క మనిషి... అయ్య కూతురు పనికొస్తుందేమో చూడండి' అని ఎవరో చెవులో ఊదారు. కమాల్ సాబ్ వెళ్లాడు.

ఎక్కడ చేతుల్లోంచి జారిపోతుందో అని బిగించి పట్టిన పిడికిలి...వేళ్ల సందుల్లోంచి రసం కక్కుతున్న అరటిపండు...సగం తిన్న ఆనవాళ్లున్న చిన్నారి లేత పెదవులు...కళ్ల నిండా సంభ్రమం.... అదీ మీనాకుమారి ప్రథమ దర్శనం. 'ఫో...! లోపలికెళ్లి మొహం కడుక్కురా వెధవ మొహం దానా!' అని చిత్రంగా అరిచిన అలిబఖ్ష్..బెదిరి పారిపోయిన పెద్ద కళ్ల పాప...! ఎవరూహించారు భవిష్యత్ గురించి. ఆ పాప కోసం కమాల్ అమ్రోహీ పిచ్చెక్కినంత పని చేస్తాడనీ. 15 ఫిబ్రవరి 1952నాడు వాళ్లిద్దరూ చడీచప్పుడు కాకుండా మూడో కంటికి తెలీకుండా నికాహ్ చేసుకున్నారు. నికాహ్ అంటే పెళ్లి. పెళ్లి తర్వాత కొందరి జీవితాలు నందన వనాలవుతాయి. వాళ్లు అదృష్టవంతులు. మరికొందరు చిరుగుల విస్తరాకుల్లా చిత్రహింసలతో చితికిపోతారు. 'ఫూల్ ఔర్ పత్తర్'

(66), దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయీ (60), సాహెబ్ బీబీ ఔర్ గులామ్ (62)'తో దిగంతాల కావల కీర్తి సంపాదించుకున్న అతి సున్నిత మనస్కురాలైన మీనా కమాల్ వ్యక్తిత్వంలోని కరుడుకట్టిన ఛాందసవాద భావాలను పూర్తిగా జీర్ణించుకోలేకపోయింది. ప్రేమ సున్నితమైనది. ఒక శరద్రాత్రి, ఏటవాలు క్షణాల మీద నిటారుగా నిలబడి వెన్నెల్లో సరిగమల సంగీతాన్ని సృష్టించి మైమరచిపోయేలా చేసేది ప్రేమ.

అందం అర్హతల వల్ల తొలి ఆకర్షణ..అందంగా మెలివేసుకున్న భావాల్లాంటి ఆత్మీయత...ప్రేమించే హృదయం...ప్రేమించుకునే వ్యక్తిత్వం... మెల్లమెల్లగా మీనా కుమారి జీవితంలోంచి అసలు సిసలు ప్రేమించే మనిషి తొలిగిపోయి క్షణికావేశాల సింగారింపులు చోటు చేసుకోసాగాయి. కమాల్ అమ్రోహీకి ఆమెకు మధ్య వయస్సు సమతుల్యం, ఆసక్తి మాయదారి జారుడు బాటలవైపు దారితీసింది.

'సాహెబ్ బీబీ ఔర్ గులామ్' నాటికల్లా మీనాకుమారి జీవితం సాహెబ్ లేని బీబీలా మద్యానికి గులామ్ అయిపోయింది. అది ఎంతగా భ్రష్టు పట్టించాలో అంతగా చీల్చి చెండాడింది. మీనా అందం, వయస్సు, అంతర్గత మథనం, వేదనల కొలిమిలా మారి హీరోయిన్ వేషాలు దూరం కాసాగాయి. అది ఇంకా బాధాకరంగా పరిణమించింది. పరిస్థితి ఎంతగా దిగజారిందంటే బాత్‌రూంలోని ఫినాయిల్ బాటిల్స్‌లోనూ మద్యం వేషం మార్చుకొని చేరేదని ఆత్మీయులు బాధాతప్తంగా చెప్పేవారట. మీనాది కవితా హృదయం...సున్నితమైన తత్వం! ఆత్మీయుడైన అశోక్‌కుమార్ హోమియోపతి వైద్యుడు కదా. వుండబట్టలేక ఒళ్లుమండి 'బుద్ధుందా నీకు? ఇలాగైతే ఎక్కువ రోజులు బతకవు' అని దులిపాడు.

'మృత్యువు నన్ను ఎక్కువ ఇబ్బంది పెట్టదులెండి' అని కళ్లు వాల్చుకొని చెప్పిందావిడ. ఒకప్పుడు తెర నిండా జిగేల్‌మని వెలుగుల నవ్వుల్నీ, అంతే దీటుగా శోకాన్నీ పండించిన మీనా నిజజీవితపు డైలాగ్‌లకు అశోక్‌కుమార్ అంతటి మహానటుడి కళ్లు చెమర్చాయి.

మీనాకుమారి ఇక లేదు అనే వార్త దావానలంలా గుప్పుమని ముంబాయిలో పాకినప్పుడు అశోక్‌కుమార్ ఏదో సినిమా షూటింగ్‌లో వున్నారు.
'14-15 సినిమాల్లోని ఆత్మీయత ఇలా కకావికలమై, భగ్న హృదయగా అంతిమ మజిలీవైపు ప్రయాణం చేస్తున్నది. చూసే ధైర్యముందా?' అని అంతరాత్మ ప్రశ్నిస్తే ధైర్యం లేక మధ్యలోంచే తిరిగి వచ్చేశాడాయన.

సినీ పండితులు విషణ్ణంగా పలికిన మాటలు అక్షరసత్యాలు. 'పాకీజా' చిత్ర నిర్మాత కమాల్ అమ్రోహీని, వెళ్తూ వెళ్తూ కాసులతో సత్కరించింది మీనాకుమారి. 'పాకీజా' రిలీజైన

రోజుల్లో మీనాకుమారి మరణించింది. జనం పిచ్చి వ్యామోహంతో తండోపతండాలుగా 'పాకీజా'ను వెళ్లి చూశారు. అందులో ఒక రీల్లో మీనా అందంగా ముద్దు ముద్దుగా కనిపించింది. తర్వాతి రీల్లో లావుగా ముద్ద ముద్దగానూ కనిపించింది. జనం పట్టించుకోలేదు. అభిమానులంటే ఇలాగే వుంటారన్నమాట...మనలా..."

'బైజుబావరా' లోని సంగీతానికి బేహోష్ అయిపోయి మనం సినిమాను సూపర్ డూపర్ హిట్ చేసి పారేశాం. 'ఫూల్ ఔర్ పత్థర్' ను అలాగే తల మీద ఎత్తుకొని ఊరేగాం. 'పాకీజా' విషయంలోనూ అంతే జరిగింది. అయితే 'బైజూ' లోని గీతాలంత బహార్‌దార్‌గానే వున్నాయి 'పాకీజా' లోని గీతాలు.. నేటికీ మనల్ని అనంత లోకాలకెళ్లిన మీనాను జ్ఞాపకం చేయించి కాసేపు ఏకాంతంతో ఉక్కిరి బిక్కిరి చేసి పారేస్తాయి.

మీనాకుమారి చెల్లెలు మాధురిని ప్రముఖ హాస్యనటుడు మెహమూద్ వివాహం చేసుకున్నాడు. ఆయన ఆత్మకథనం లాంటిదే హనీఫ్ జకేరీ రాసుకున్న పుస్తకం 'మెహెమూద్.... ఎ మ్యాన్ ఆఫ్ మెనీ మూడ్స్' (2005)... మోహన్‌దీప్ రాసిన పుస్తకం 'సింప్లీ స్కాండలస్' లో ఆవిడ స్వయంగా మానసికంగా చితికిపోయి ఆత్మన్యూనతా భావంతో జీవితాన్ని అరాచక స్థితికి తీసుకెళ్లిందన్నది తేటతెల్లమవుతుంది.

మగన్ బెహారీలాల్ నిగమ్ 'మీనా-కమాల్'లకు ఆ రోజుల్లోని సన్నిహితుడు. సంపాదించిన ప్రతి కానీ ఆవిడ కమాల్ చేతుల్లో వుంచేది. ఆయన రాత్రి ఎంత పొద్దు పోయి వచ్చినా పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా ఎదురుచూసేదనీ రాశాడు.

'మర్తే వక్త్ తక్ భీ మెరే షౌహర్ కా నామ్ కమాల్ అమ్రోహీ హోగా' (ఆఖరు శ్వాస పీల్చేదాకా నా భర్త పేరు కమాల్ అమ్రోహీయే...' అనేది ఆవిడ.

వ్యక్తిగత అపోహలూ, వృత్తిపరమైన అభిప్రాయ భేదాలూ, సున్నితమైన క్షణాల్లో మొండితనం, అతి మొండి పట్టుదలలూ...వెరసి....ట్రాజెడీ క్వీన్ జీవిత చరమాంకం అంతా ట్రెజెడీతో నింపి పెట్టాయి. మీనాకుమారి చేయి తిరిగిన కవయిత్రి కాకపోవచ్చు కానీ ఏకాంతంలో ఆవిడకు అంతో ఇంతో తోడిచ్చింది ఆవిడ కలమే అనే విషయాన్ని మనం గుర్తించాలి. జీర మనల్ని కదలించిక మానదు.

'తలాక్ తో దే రహే హో నజరే
కహర్ కే సాథ్
జవానీ భి మెరీ లౌటాదో మెహర్ కే సాథ్'
(ముస్లిం సాంప్రదాయం ప్రకారం 'తలాక్' అని వదిలించుకున్నారు...నా యవ్వనాన్నీ..'మెహెర్'తో పాటు తిరిగి వాపసు చేయగలరా....?)
'చాంద్ తన్‌హా హై..ఆస్మా తన్‌హా" అనే గజల్ లోని కొన్ని పంక్తులు ఆమె ఏకాకి తనం గురించి చెప్పకనే చెప్తాయి మౌనంగా.

'ఏకాకి ఈ జాబిలి..ఏకాకి ఆవేశం
అన్నీ దిక్కుల్లో ఏకాకిగా హృదయాలు..
ఆశలు ఆరిపోయాయి...అస్తమించాయి తారకలు
కంపిస్తూ ప్రాకుతున్న ఏకాకి పొగ వలయాలు...'

ఆ కవితలూ, డైరీలు..'గుల్జార్' చేతుల్లో పెట్టి ధర్మేంద్ర లాంటి దోస్తుల చేతుల్లో తన భావాలను అర్పించి-అసంపూర్ణ, అసంతృప్త జీవితాన్ని అసందిగ్ధంగా అంతం చేసుకున్న మీనా హాస్పిటల్ బిల్లులు కట్టలేకపోతే ఫ్యామిలీ డాక్టరైన డా॥ కె.ఎమ్.షాహ్ 'సబ్‌సే బడీ ఖుషీ సబ్ సే బడా గమ్' అనే చిరు కాలమ్‌లో ఇలా అన్నారు.

'ఎన్నోసార్లు మీనా దీదీ నా క్లినిక్‌కు వచ్చింది. ఓసారి ఆవిడ కారును చూసి ఎంతో బావుంది ఈ ఫారెన్ కారు అన్నాను తమాషాగా...మరునాడు ఉదయం ఆ కారు నా ఇంటి గుమ్మం ముందొచ్చి వాలింది. వెనువెంట ఫోన్ మీద మీనా కంచుక గొంతు పలికింది 'అది మీకోసం...'. వెంటనే తిప్పి పంపిస్తే బాధపడ్తుందని ఓ నెల రోజులుంచుకొని తిరిగి పంపించాను. ఆవిడను బతికించుకోలేకపోయాం అనేకన్నా...బతకాలనే ఇచ్ఛ ఆమెలో ఎందుకోమరి నశించింది..."

మీనాకుమారి కాలేయ వ్యాధితో (సిర్రోసిస్ ఆఫ్ లివర్) 31.3.1972నాడు మౌనంగా కోట్ల కొద్దీ రసికులను ఏకాకులను చేసి వెళ్లిపోయింది. నేటికి 30 సంవత్సరాలు. అంటే ఈ తరానికి బొత్తిగా పరిచయం లేని కళాకారిణి. కానీ మిత్రులారా ఏ పాత తెలుపు నలుపు సినిమానైనా పలకరించండి.

'ఆరంభం అయితే అవుతుంది కాని ముగింపు వుండదు...
నా కథల్లో ఎందుకో మరి నా పేరే వుండదు. అని మీనా పలకరించిపోతుంది. తడికళ్లతో మీరు జీవితాంతం ఆ పేరు మరిచిపోరు. అంతే దటీజ్ ఎ ఫాక్ట్!! ❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622

సైన్సు సృజనకు మారుపేరు ఆర్థర్ క్లార్క్

ఎస్. వెంకట్రావు



ప్రపంచంలోనే అతి గొప్ప సైన్సు రచయితగా పేరు తెచ్చుకున్న ఆర్థర్ క్లార్క్ 1917లో ఇంగ్లండులో జన్మించాడు. తల్లి, తండ్రి ఇద్దరూ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగులు. ఆ విధంగా క్లార్క్‌కు మొదటినుండి కమ్యూనికేషన్స్‌తో సంబంధం ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఆయన బ్రిటిష్ వైమానిక దళంలో రాడార్ శిక్షకుడిగా పనిచేశారు. ఆ సమయంలోనే ఆయన విడుదల చేసిన పరిశోధనా పత్రంలో ఉపగ్రహ కమ్యూనికేషన్స్ వ్యవస్థల గురించి ప్రతిపాదించాడు.

ఆయన "2001 అంతరిక్ష యానం" వంటి గొప్ప సైన్స్ ఫిక్షన్ నవలలతో ప్రపంచ సాహితీ ప్రియులను అలరించిన వ్యక్తి. అయితే హెచ్‌జి వెల్స్, జూల్స్ వెర్న్ లాగా పూర్తిగా సైన్స్ ఫిక్షన్ కథలూ, నవలలు మాత్రమే రాసిన వ్యక్తి కాదు. ప్రస్తుతం భూమి చుట్టూ పరిభ్రమిస్తూ, ఆధునిక సమాచార సదుపాయాలకు మూల స్థంభాల్లాగా ఉన్న 250కి పైగా కమ్యూనికేషన్స్ ఉపగ్రహాలకు ఆశ్రయం ఇస్తున్న భూ-స్థిర కక్ష్యకు ఆయన పేరు పెట్టారు. కారణం భూమి చుట్టూ కమ్యూనికేషన్స్ ఉపగ్రహాలకు అటువంటి ఒక ఆశ్రయం ఉన్నదని మొట్టమొదట తన పరిశోధనా పత్రం ద్వారా తెలియజేసిన వ్యక్తి ఆయనే. కాని ఆయన మాత్రం ఖగోళ శాస్త్ర వేత్త కాదు.

ఆయనో పరిశోధకుడు, సైన్సు రచయిత, కథకుడు, నవలా కారుడు, నాటక రచయిత, సినిమా రచయిత, టీవీ వ్యాఖ్యాత, అన్నిటికీ మించి గొప్ప భావుకుడు. ఆయన భావుకత భూ మండలం ఎల్లలు దాటి ఈ మహావిశ్వపుటంచులు తాకింది. ఆయనే... 90 ఏళ్ల నిండు జీవితాన్ని అనుభవించి ఈ నెల 19న శ్రీలంక రాజధాని కొలంబోలో కన్నుమూసిన సర్ ఆర్థర్ సి. క్లార్క్. '2001-ఎ స్పేస్ ఒడిస్సే' చిత్రం ద్వారా క్లార్క్ చాలా మందికి బాగా పరిచయం. అదే పేరుతో ఆయన రాసిన నవలను చిత్రంగా తీశారు. దానికి సీక్వెల్‌గా ఆయన'2010-ఒడిస్సే' '2061-ఒడిస్సే' నవలలు రాశారు. మొత్తంమీద క్లార్క్ రచనలు 137 గ్రంథాలుగా వెలువడ్డాయి. వాటిలో సైన్సు నవలలు, సైన్సు రచనలే కాకుండా కథ, నవల, నాటకం వంటి సాహితీ సృజనలు అనేకం ఉన్నాయి. కాని క్లార్క్ గొప్పతనమంతా సైన్సు రచనల్లో ఆయన చూపించిన గొప్ప ముందుచూపులోనే ఉంది. అంతరిక్ష యానాల్లో ఉపయోగించే అనేక రకాల సాంకేతిక నైపుణ్యాల గురించి ఆయన ముందుగానే ఊహించి తన రచనల్లో పొందుపరిచాడు. ఇంకో మాటలో చెప్పాలంటే క్లార్క్ రచనల్లో పేర్కొన్న అనేక సాంకేతిక నైపుణ్యాలను అనంతర కాలంలో అంతరిక్ష పరిశోధకులు కనుగొన్నారు. జూల్స్ వెర్న్ లాంటి గొప్ప విజనరీ సైన్సు రచయితలు మాత్రమే అటువంటి ముందస్తు 'జోస్యాలు' చెప్పగలిగారు. క్లార్క్ తన రచనల్లో ప్రపంచ కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటుకు భూమిచుట్టూ అంతరిక్ష కక్ష్యను ఉపయోగపెట్టుకునేట్లు రాశాడు. భూ మధ్యరేఖ చుట్టూ భూమికి 3600 కిలోమీటర్ల కక్ష్య కమ్యూనికేషన్స్ ఉపగ్రహాలకు ఆశ్రయంగా ఉంటుందని ఆయన రాశాడు. నిజంగానే నేడు ప్రపంచ దేశాలు పంపే కమ్యూనికేషన్స్ ఉపగ్రహాలన్నీ క్లార్క్ చెప్పిన అంతరిక్ష 'బెల్ట్' లోనే పరిభ్రమిస్తున్నాయి. భూ స్థిర కక్ష్యగా పిలవబడే ఈ బెల్ట్‌కు ఆర్థర్ క్లార్క్ పేరు పెట్టారు. ప్రస్తుతం ఈ కక్ష్యను క్లార్క్ కక్ష్య అనీ, ఈ బెల్ట్‌ను క్లార్క్ బెల్ట్ అనీ పిలుస్తున్నారు. ఆ విధంగా ఈ అంతరిక్ష ప్రేమికుని మేధోశక్తికి ఖగోళ ప్రపంచం సముచితమైన గుర్తింపునిచ్చింది.

ప్రపంచంలోనే అతిగొప్ప సైన్సు రచయితగా పేరు తెచ్చుకున్న ఆర్థర్ క్లార్క్ 1917లో ఇంగ్లండులో జన్మించాడు. తల్లి, తండ్రి ఇద్దరూ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగులు. ఆ విధంగా క్లార్క్‌కు మొదటినుండి కమ్యూనికేషన్స్‌తో సంబంధం ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఆయన బ్రిటిష్ వైమానిక దళంలో రాడార్ శిక్షకుడిగా పనిచేశారు. ఆ సమయంలోనే ఆయన విడుదల చేసిన పరిశోధనా పత్రంలో ఉపగ్రహ కమ్యూనికేషన్స్ వ్యవస్థల గురించి ప్రతిపాదించాడు. దానికిగాను

ఆయనకు ఫ్రాంక్లిన్ ఇన్‌స్టిట్యూట్ బంగారు పతకం ఇచ్చింది. 1994లో ఆయన పేరు నోబుల్ బహుమతికి ప్రతిపాదించబడిందిగాని బహుమతి రాలేదు. అంతరించి పోతున్న గొరిల్లాలను రక్షించాలంటూ ఆయన పెద్ద పోరాటమే చేశారు. దానికిగాను 1962లో ఆయనకు యునెస్కో అవార్డు లభించింది.

సైన్సు రచయిత అయిన క్లార్క్ శాస్త్రీయ దృక్పథం కల వ్యక్తి. దేవుడు, దయ్యాలపైన కాకుండా మానవత్వంపైనా, మనిషియొక్క విజ్ఞతపైనా నమ్మకం ఉంచాడు. "నాకు దేవుడుమీదగాని, పునర్జన్మలమీదగాని నమ్మకం లేదు" అని ఆయన ప్రకటించాడు. అంతేకాదు చరిత్రలో మతం పేరుతో జరిగిన దురాచారాలు, యుద్ధాలను ఆయన ఒక ఇంటర్వ్యూలో దుయ్యబట్టాడు. తన మరణానంతరం ఎటువంటి మతపరమైన క్రతువులు లేకుండా అంత్యక్రియలు జరపాలని ముందుగానే రాసిపెట్టుకున్నాడు.

సైన్సును యుద్ధం కోసం దుర్వినియోగం చేయడాన్ని క్లార్క్ అసహ్యించుకున్నాడు. అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకోసం ఉపయోగించాలని కోరుకున్నాడు. అందుకోసమే ఆయన 1980లలో రొనాల్డ్ రీగన్ ప్రతిపాదించిన 'స్టార్ వార్స్' కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. చివరికి ఆయన పశ్చిమ దేశాల జీవన విధానానికి దూరంగా నివసించాలన్న కోర్కెతో 1956లో శ్రీలంక చేరుకుని ఆ దేశ పౌరసత్వం స్వీకరించి అక్కడే తుదిశ్వాస విడిచాడు. జీవిత చరమాంకంలో ఆయన పక్షవాతంతో వీల్‌ఛైర్‌ను ఆశ్రయించాడు.

మానవ మేధో సృజన యొక్క అత్యున్నత రూపమే సైన్సు. ఒక గొప్ప రచన చేసే మేధస్సే ఒక గొప్ప శాస్త్ర-సాంకేతికావిష్కరణకూడా గావిస్తుంది. ఆర్థర్ క్లార్క్ యొక్క సైన్సు రచనల్లోనూ, సైన్సు ఫిక్షన్‌లోనూ ఈ రెండు సృజనలూ కలగలిసి పనిచేశాయి. అందుకే ఆయన సైన్సు ఫిక్షన్ గొప్ప ఖగోళ ఆవిష్కరణలకు ప్రేరణ నిచ్చింది. క్లార్క్ మృతితో ప్రపంచం అటువంటి ఒక గొప్ప సృజనశీలిని కోల్పోయింది. సాంకేతిక పరిజ్ఞానం ఉరుకులు పరుగులతో ముందుకుపోతున్నప్పటికీ శాస్త్రీయ సృజన కొరవడుతున్న నేటి ఆధునిక యుగంలో క్లార్క్ స్ఫూర్తిని నలుదిశలా వ్యాపింపజేయడం ఎంతో అవసరం. ❋

నాకు ఆస్తిలో వాటా రావాలంటే...

మా తాతగారికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. ఆయనకు 16 సెంట్ల స్థలం, 1/2 ఎకరం పొలం ఉన్నాయి. నేను పెద్ద కుమారుడి కొడుకును. మా నాన్నగారికి ఇద్దరు కుమారులం. నేను చిన్నవాడిని. మా ఆస్తి మొత్తం మా తాతగారు, మా బాబాయి కొడుక్కి వీలునామా రాశారు. దానికి మా అత్తయ్యలు, ఆ బాబాయిలు, మా నాన్న, మా అన్నయ్య సాక్షి సంతకాలు పెట్టారు. నేను పెట్టలేదు. ఎందుకంటే అప్పుడు నేను మైనర్‌ని. మా బాబాయి కొడుకు కూడా మైనరే. మాకు మా బాబాయి ఏ ఆస్తి ఇవ్వలేదు. ఇప్పుడు నేను కోర్టులో కేసు వేయాలనుకుంటున్నాను. నాకు చెల్లుతుందా. నేను కేసు పెట్టవచ్చా. నాకు హక్కు ఉందా? దయచేసి మాకు మంచి సలహా ఇవ్వగలరు. మా నాయనమ్మ ఆస్తి అంతా మా బాబాయి కొడుక్కి రిజిస్ట్రేషన్ చేసింది. అప్పుడు కూడా నేను మైనర్‌నే. నాకు ఎటువంటి హక్కులు ఉన్నాయి చెప్పండి?

అది మీ తాతగారి ఆస్తి అంటున్నారు. కావున ఆస్తిని ఆయన వీలునామా ద్వారా దఖలు పర్చడం జరిగింది. దీనికి వారసులయిన మీ నాన్న, అత్తమ్మలు మొదలగు వారు సమ్మతించారు కూడా. అందువల్ల మీకు ఈ రోజు దీనిని అడిగే అధికారం, హక్కు వుండదు.

అక్కడ అమ్మాయి... ఇక్కడ అబ్బాయి... మరి విడాకులు వస్తాయా?

నా స్నేహితునికి మార్చి 6, 2003న వివాహం అయింది. పెద్దలు నిశ్చయించి చేశారు. ఆమె మార్చి 22, 2003న కాపురానికి వచ్చినంది ఆమెది విజయవాడ. అతనిది ఏలూరు. ఆ అమ్మాయికి గుండె ఆపరేషన్ జరిగిందని వివాహం జరిగాక తెలిసింది. మూడు నెలల తరువాత అమ్మాయి వాళ్ళ తల్లిదండ్రులు ఆషాఢమాసం అని చెప్పి అమ్మాయిని తీసుకెళ్ళారు. ఆషాఢం తరువాత పెళ్ళికొడుకు వెళ్ళి అమ్మాయిని పంపమని అడిగితే అమ్మాయి తండ్రి 'నీవు కొడుతున్నావట, తిడుతున్నావట' అని నిందలు వేసి ఇతనిని పంపేశారు. ఆ రోజు నుండి ఈనాటి వరకు రాలేదు. వాళ్ళతో ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేవు. అమ్మాయి విజయవాడలో, అబ్బాయి ఏలూరులో ఉంటున్నారు. ఐదు సంవత్సరాలు గడియిపోయింది కనుక అబ్బాయి తరపు వారు విడాకులు కోరవచ్చా. విడాకులు ఇద్దరికీ ఇష్టమైతే ఎన్నిరోజుల్లో మంజూరు అవుతుంది?

ఐ.వి.ఎస్. మణ్యేశ్వరరావు, మచిలీపట్నం.

వివాహం అయి ఏ సమస్య లేకుండా ఉన్న వాళ్లని కొడుతున్నాడనే నెపం ఎందుకు పెడతారు? ఆపరేషన్ జరిగింది అమ్మాయికి, అది దాచారని కోపం అబ్బాయికి ఎక్కడో ఉండి ఉంటుంది. దీంతో ఈ సమస్య వచ్చి ఉంటుంది. బంధువులు / పెద్దల సమక్షంలో పరిష్కారం అన్వేషించండి. అప్పటికీ కుదరకపోతేనే కోర్టుకెళ్ళాలి. మీ వద్ద సబ్‌కోర్టులో 'రిస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్' కింద భార్యను కాపురానికి పంపించమని దావా వేయండి. అప్పటికి ఆమె రానంటే ఆ దావా తర్వాత విడి కాగితాలకు అదే కోర్టులో ఫైలు చేసుకోవలసి ఉంటుంది. మానవ సంబంధాలు చాలా సున్నితమైనవి. వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. అవి ఒకసారి చెదిరితే ....ఇరువురి సమస్యలు ఇలాగే ఉంటాయి. ఒకరికొకరు సమస్యలు మాట్లాడుకొని అర్థం అయ్యేటట్లు వ్యవహరించడం మంచిది. లేదంటే కుటుంబాల పరువు కోల్పోవలసి ఉంటుంది.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవు తున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది,
9848994240

వైవిధ్యభరితమైన వస్తువు

...ాలయం
శ్రీకాకుళం

'అనలానిలము' అంటే చాలా మంది రసిక పాఠకులకు 'ప్రశ్నా చిహ్నం' లా కొత్త శీర్షికలా అనిపించవచ్చు. దాని శబ్దార్థ సారం 'నిప్పు గాడుపు'. కవితల్లో వస్తువు వైవిధ్యభరితంగా తోస్తుంది. సంపుటి లోని 124 పేజీల్లో ఉపదేశాలూ, చమత్కారాలూ, అధిక్షేపం నిండిన భావాల కవితలున్నాయి. ఆశయ నిబద్ధత ఉంది. అభివ్యక్తి స్పష్టత కూడా ఉంది.
మద్యం-కైపు-చట్టం-ఛందోబద్ధతా ఉంది.
'చట్టబద్ధ మద్యమ్మును
చట్టమనుమతించు చోట
నేత్రాగితి, కైపెక్కితి-
కైపు చట్ట బద్ధమే కదా!'

'పిరికితనం నిర్లిప్తత - అసహాయత అనైక్యత' అంటూ 'పరిష్కారం' లోపలికి, 'దొర నీ బాంచెనే కాల్మొక్త' అంటూ
'నువ్వుస్తవని
ఊరంత గట్టాన
'ప్లాస్టిక్' జండల్దిని
పొద్దు మాపు పొలిచ్చే
నాగోద
సచ్చిపోయిందే!'

అంటూ 'రాకు దొరా!' అనే కవనం దర్శనమిస్తుంది. కొన్ని 'కవిత్వం ధోరణుల్లో' సరాసరి మామూలు పద్ధతులూ, పోకళ్ళూ కన్పించినా, మరికొన్ని 'నేను కాస్త ప్రత్యేకం నాయనా!' అని పలికిస్తాయి.

అనలానిలము (కవితా సంపుటి)
రచన: వరిగొండ కాంతారావు
పేజీలు: 124, వెల: రూ 80/-
ప్రతులకు: సహృదయ సాహితీ సంస్థ, విజయనగర్ కాలనీ, హనుమకొండ, విశాలాంధ్ర, ఇతర ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.

ఆలోచింపచేస్తేనే సార్థకత

"అతని వేళ్ళకు అంటు లేదు
అతని రాగానికి జాతి లేదు
కులం లేదు, మతం లేదు" లాంటి సెక్యులర్ భావాలు ఒక చోట....

లోగడ 5-6 కవితా సంపుటాలు రసికుల కందించినా-

వెయ్యొన్నొక్క అంచులున్న కవిత్వానికి ఒకే గుండె- అదే జీవన లాలస-జీవన సాగరంలో దూకి - గుడ్డి గవ్వో, మేలి ముత్యమో, దేన్నో ఒక దాన్ని బయటికి తీయడం - కవిత్వమేమిటి - అభివ్యక్తిని ఒక రసమయ రూపంగా బహిర్గతం చేయడం... అలా సమాజపు మార్పులకు, అన్ని ఒడిదుడుకులకు, చలనాలకు, నిశ్చేష్టలకూ, జడత్వాలకూ, సంకీర్ణ సందర్భాలకు చలించి, రకరకాల ప్రక్రియల్లో కవిత్వం రాయడం మటుకు ఆపలేదు.

ప్రతి సగటు మామూలు మనిషికి నాయనమ్మ, అమ్మమ్మ ఉండక తప్పదు. పాతకాలం నాటి వారి చేతి కడియాలు ఎంత 'మంది' ని కదిలిస్తాయో చెప్పలేం కాని 'కడియాల'తో పాటు- 'వ్యవస్థ మీద కోపం'- 'అమ్మ'- 'తడి'-తో పాటు 'భాగ్యనగరంలో వాహన చోదకులు' ఈ కవితా సంపుటిలో 'చెట్లను నడిపిస్తూ' చేరిపోయారు.

కవిత, మనసుల్లోంచి కాయితాల మీద ...అక్కడి నుంచి మళ్ళీ మనసుల్లో దూరి కాస్తంతైనా ఆలోచింపచేసేలా ఉంటేనే సార్థకత. 'సనారా'కు ఇవి తెలియనివి కాదు. వర్తమాన కవిత్వంలోని కొత్త పోకడలూ, చిక్కని గాఢమైన అల్లికా, చదివించే తత్వం.... ఉన్న కవిత్వం నిత్య నూతనం.

అమ్మమ్మ చేతి కడియాలు
(కవితా సంపుటి)
మాధవి సనారా
పేజీలు: 100, వెల: రూ 50/-
ప్రతులకు: మాధవి సనారా, నిదానం దొడ్డి, అనకాపల్లి విశాలాంధ్ర/ నవోదయ/ దిశా పుస్తక కేంద్రం

- డా॥ జె.పి. వైద్య

ఖండాంతర



కవిత్వం
వి.ఆర్. విద్యార్థి
వెల:60/-,
పేజీలు:79
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, దిశ, నవోదయ, ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు.

మానవతా సమన్వయ మహాకవి

డా॥ సి. నారాయణ రెడ్డి

రచయిత: డా॥ సందినేని రవీందర్



వ్యాస సంపుటి
వెల:40/-,
పేజీలు:60
ప్రతులకు:
విశాలాంధ్ర,
అన్ని బ్రాంచీలు
నవోదయ బుక్‌హౌస్
తెలుగు బుక్ హౌస్

ఏకలవ్య విజయము



(నాలుగంకముల నాటకము)
టి.వి.నారాయణరెడ్డి
వెల:75/-,
పేజీలు: 68
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయ, బుక్ హౌస్,టి.వి. నారాయణరెడ్డి, 209, కె.కె. టవర్స్, యూసఫ్‌గూడ, హైదరాబాద్.

స్వప్న సత్యం

డి. రామచంద్రరాజు

వెల:50/-
పేజీలు:60
ప్రతులకు:
శ్రీమతి డి. సూజాత డోర్ నెం. 4-6-25, మిద్దెమీద రిజర్వాయర్ కాలనీ, తిరుపతి.

ఆహా ఏమి కేశ సంపద!

‘వీరి పా..డ..వా..టి కేశములు చూచుటకు రెండు కళ్లూ చాలడంలేదే! కురులు ఈ విధంగా వృద్ధి చెందుటకు ఎటువంటి శ్రద్ధ వహించినారో...!’

‘ప్రత్యేకమైన శ్రద్ధ ఏమీ తీసుకోలేదు. వాటంతట అవే ఈ విధంగా పెరిగాయి’

‘ఇది సత్యమా? మరి అటులైన మనకునూ అలా పెరగవచ్చు కదా’

‘అందరికీ అలా పెరిగే అవకాశమే వుంటే మనకా దిగులెందుకు?’

‘ఆ...అదియునూ నిజమే. ఇంతకీ వీరు ఎచటివారు?’

‘అది తెలిస్తే...ప్రారంభంలోనే విన్నవించుకునేవారం కదా’

‘ఓహో... మీకూ తెలియదా! ఏ విషయానికి ఆ విషయమే వెల్లడించుకోవాలి సుమా. ఈ కేశ సుందరులు ఎచటకేగితే అచట అందరి కళ్లూ వీరిమీదే వుంటాయేమో! ఇంతకీ...తమ కేశ పోషణ కొరకు బహు సమయం కేటాయించవలెనేమో!’

‘అందులో అనుమానమేల! మనలా మనసుకు తోచినప్పుడు తలస్నానము చేయుటకు వుండదు! వారానికో పక్షానికో ఇద్దరు ముగ్గురు చెలికత్తెల సాయంతో ఆ బృహత్తర కార్యాన్ని పూరించాలి..ఇక ఎక్కడికైనా హుటాహుటిన వెళ్లుటకు ఈ కురులే ఆటంకము కదా’

‘అదియునూ...నిజమే. కేశపోషణకు, అలంకరణకు పడ్డ కష్టమంతా....బహిరంగ ప్రదేశాలకు వచ్చినప్పుడు తోటి జనుల ప్రశంశలూ...పొగడ్తలతో మర్చిపోవచ్చు. ఏమందువు?!

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్టుకార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండి. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

శ్రీకాకుళం

పేరు : చందిరెడ్డి అనూష
చదువు : 7వ తరగతి
వయసు: 12 సం॥
స్కూలు : శ్రీ వాణి విద్యాలయం,యుపిఎస్, నంగునూరు
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : చదవడం, టీవీ చూడడం
చిరునామా : చందిరెడ్డి అనూష, డాటరాఫ్: లక్ష్మారెడ్డి, ఘనాపూర్, నంగునూరు, మెదక్.

పేరు : కావలి ప్రీతి
చదువు :3వ తరగతి
వయసు: 8 సం॥
స్కూలు : సూర్య విద్యానికేతన్
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు : టీవీ చూడడం
చిరునామా : కె. ప్రీతి, పి.ఆర్ కాలనీ, గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

పేరు : ఆర్. జయరాజు.
చదువు : 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : జడ్.పి.హెచ్.ఎస్.
లక్ష్యం: ఐఏఎస్ ఆఫీసర్ కావడం
హాబీలు : చదవడం, క్రికెట్ ఆడడం, కవితలు రాయడం, సినిమాలు చూడడం
చిరునామా : ఆర్. జయరాజు, సన్నాఫ్: లక్ష్మన్న, ముండ్లదిన్నె, వడ్డెపల్లి, అలంపూర్, మహబూబ్‌నగర్.



పేరు : సిహెచ్. అజయ్‌కుమార్
చదువు : 9వ తరగతి
వయసు: 14 సం॥
స్కూలు:మధు విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం,
చిరునామా : సిహెచ్. అజయ్‌కుమార్, సన్నాఫ్: నారాయణ, జూలూరుపాడు, ఖమ్మం.

పేరు : వై. వంశీ
చదువు : 6వ తరగతి
వయసు: 11 సం॥
స్కూలు : శ్రీ వాణి విద్యాలయం,యుపిఎస్, నంగునూరు
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
చిరునామా : వై. వంశీ సన్నాఫ్: మాధవ రెడ్డి, నంగునూరు, మెదక్.

పేరు : ఎం. సాయిరాం రెడ్డి
చదువు : 7వ తరగతి
వయసు: 13 సం॥
స్కూలు : శ్రీవాణి విద్యాలయం యుపిఎస్, నంగునూరు
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : పేపర్ చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
చిరునామా : ఎం. సాయిరాం, సన్నాఫ్: శ్రీనివాస రెడ్డి, ఘనాపూర్, నంగునూరు, మెదక్.